# గురు–శిష్య సంవాదము



మాస్టర్ పార్వతీకుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# గురు-శిష్య సంవాదము

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2019

ప్రతులు : 1,000

© ధనిష్ఠ - 2019

వెల : రూ॥ **60-00**

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

Website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-37-1

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్, విశాఖపట్నం.

ఫోన్ : 0891-2796538, 984 999 6538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 34 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవ సేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

'గురు–శిష్య సంప్రదాయ'మను శీర్షికగ వంద (100) ప్రశ్నలకు సద్గురువిచ్చిన వినూత్నమగు సమాధానములు జిజ్ఞాసువుల కొరకై అందింపబడినవి. ఈ ప్రచురణయందు ఆధునిక లోకమున చదివీ చదువని శిష్యులడుగు ప్రశ్నలకు సద్గురువిచ్చిన సమాధానములు ఆసక్తికరముగ నుండును. జ్ఞానప్రకాశముగ కూడ యుండును. తీరిక సమయములలో బృందముగ ఇందలి ప్రశ్న నొక దానిని క్షుణ్ణముగ చదువు కొనినచో ప్రయోజనకరమగు విజ్ఞానము లభించును.

కాకతాళీయముగ ప్రారంభమైన ఈ వ్యాసంగము ఒక చిన్న పుస్తకమగుట ఒక చిత్రమైన అవతరణము.

ఈ ప్రచురణ ప్రయోజనకరమై నిలచుగాక!

ఈ ముద్రణను **శ్రీ రాయపాటి చంద్రశేఖర శర్మ – శ్రీమతి వెంకట లక్ష్మీపద్మావతి** మరియు వారి కుమారుడు **చి॥ ఫణికిరణ్**లు సమర్పించిరి. వారికి ఆశీస్సులు!

తేది : 4-8-2019 **పార్వతీకుమార్**

# గురు–శిష్య సంవాదము

# ①

శిష్యుడు : మీ అడుగుజాడలలో నడచుటకు అనుమతించుడు.

గురువు : నా అడుగుజాడలు కొంతవరకే నీకుపయోగకరము. కొంతదూరము చనినవెనుక ఇక నా అడుగుజాడలు గుర్తింప లేవు.

శిష్యుడు : అదెట్లు?

గురువు : కొంత తడవు మాత్రమే నా అడుగుజాడలు కనిపించును. అటుపైన నేనాకాశ మార్గమున చనుదును. ఆకాశమున అడుగుజాడ లుండవు. అటుపై నీ ఇష్టం.

## (2)

శిష్యుడు : మీ స్మృతికై మీ తదనంతరము సమాధి నేర్పరచ వలెనా? మందిరము నిర్మించవలెనా? ఆశ్రమము ఏర్పరచవలెనా?

గురువు : నా తదనంతరము నేను మూలముగ ఎట్టి మతము నేర్పరచకుడు. మీకు లభించిన జ్ఞానమాధారముగ, మీరు జీవించుటకు ప్రయత్నించుడు.

శిష్యుడు : మీ తదనంతరము ఉత్తరాధికారిగ ఎవరిని భావింప వలెను? ఎవరి ననుసరింపవలెను?

గురువు : మీ యందలి సత్యమును అనుసరింపుడు. ధర్మము నాశ్రయింపుడు. నాకెవరును ఉత్తరాధికారి లేరు. నేనందించే జ్ఞాన మాధారముగ జీవింపుడు.

## 3

శిష్యుడు : గురుదేవా! మీరఖండ జ్ఞాన సంపన్నులు. కాని ప్రపంచమునకు మీరంతంత మాత్రముగనే తెలిసి యున్నారు. జనసమూహములు మీవద్ద కెందుకు ఆకర్షింపబడుట లేదు?

గురువు : నీవాకర్షింపబడితివి గదా! (అనుచు నవ్వెను)

శిష్యుడు : నావలెనే ఇతరులు కూడ మీవద్ద చేరినచో బాగుండును.

గురువు : నీయంతట నీవు వచ్చినట్లే ఇతరులు కూడ వారంతట వారు రావలెను. అట్లు వచ్చినచో వారు నిలుతురు. నేనాకర్షించినచో నాకు బరువై నిలుతురు.

## 4

శిష్యుడు : గురుదేవా! రాబోవు ఉత్తరాయణ సంక్రమణము ప్రత్యేకానుభూతి నిచ్చునని పండితులు తెలుపుచున్నారు. ఆ సంక్రమణమునకు మేమెట్లు సంసిద్ధులము కావలెను?

గురువు : రాబోవు క్షణమే ఎవ్వరికిని తెలియదు. పక్షము రోజుల తరువాత వచ్చు సంక్రమణమును గూర్చి ఇపుడు భావించుట అవివేకము. నీ చిత్తము ప్రస్తుతమందుంచుము. ప్రస్తుతమునందే సాన్నిధ్యము లభించును. భూతభవిష్యత్తుల భావన సోమరితనము.

## 5

శిష్యుడు : మీరెప్పుడును ఒంటరిగ గదిలో నేమి చేయుచుందురు?

గురువు : నే నేకాంతుడనేగాని ఒంటరివాడను కాను. నీలోనికి నీవు చొచ్చుకొని పోవుకొలది నీ కేకాంతము లభించును. అచ్చట నీ పరిసరములు, సంఘము, మిత్రులు అందరును స్మృతిపథము నుండి జారుకొందురు. అట్టి ఏకాంత మానందము నిచ్చును. అట్టి ఏకాంతమున మరొక ప్రపంచము అవగతమగును. విశ్వమంతయు క్రమముగ తానుగ దర్శనమిచ్చును.

ఒంటరితనము పేదరికము. ఏకాంతత రాజరికము.

## 6

శిష్యుడు : గురుదేవా! మీరెప్పుడును కనులు మూసుకొని ఏమి చేయుదురు?

గురువు : నా స్వస్థలమునకు పోయెదను. అచట నేను స్వస్థుడనై యుండెదను. నీవును స్వస్థానము చేరినచో అమితానందము, అనుభూతి పొందుదువు.

శిష్యుడు : స్వస్థాన మెట్లుండును?

గురువు : చేరినచో తెలియును. చెప్పినంత మాత్రమున తెలియదు. తినినచో రుచి తెలిసినట్లు, చెప్పినచో తెలియునా?

## 7

శిష్యుడు : గురుదేవా! మీరు ప్రవచనము లీయరు. ప్రబోధనములు చేయరు. పుస్తకములు వ్రాయరు. కార్యక్రమముల నేమియు నేర్పరచరు. మిమ్మనుసరించుట ఎట్లు?

గురువు : ఉండుడు. నావలెనే మీరును ఉండుడు. ఉండుట అనగానేమో తెలియును. చిందులు వేయక నుండుటయే చిన్మయ స్థితి. మీరందరును ఉండుట ఎట్లో తెలుసుకొని సుఖపడవలెను. సుఖముగ నుండుట ఎట్లో నా దినచర్య చూచినచో మీరును చప్పుడు లేక యుండవచ్చును. ఆకాశము చప్పుడు చేయక వెలుగుచు నుండును. అందే సమస్తము జరుగుచున్నవి.

## 8

శిష్యుడు : గురుదేవా! ఏ దేశచరిత్ర పరిశీలించినను ప్రధానముగ గోచరించునది యుద్ధములే. ఎన్నియో తరములు గడచినవి. సూర్యవంశపురాజులు, చంద్రవంశపురాజులు, నిరంకుశ ప్రభుత్వములు, ప్రజాస్వామ్యములు, అనేక విధమగు సిద్ధాంతములు- ఎన్ని మార్పులు గావించుకొన్నను మానవజాతి యందు యుద్ధచరిత్ర పునరావృత్త మగుచునే యున్నది. దీనికి పరిష్కారమేమి?

గురువు : తప్పులనుండి నేర్చుకొను బుద్ధి మానవునకు లేకుండుటయే ప్రధాన కారణము. జాతివరకు ఎందుకు? నిన్ను నీవు పరిశీలించుకొనుము. నీ భాషణముల యందు, నీ చేతలయందు నీవు గమనించిన తప్పులను నీవధిగమించితివా? కోటిలో ఒక్కడట్లు చేయును. ఇతరులు చేసిన తప్పులే చేయుచు నుందురు. కనుక చరిత్ర పునరావృత్తమగు

చుండును. జీవులు మరల మరల పుట్టుచు, మరల మరల అవే తప్పులు చేయుచు, మరల మరల జనన మరణ వృత్తమున బంధింపబడి మూర్ఖులవలే తిరుగుచున్నారు.

## 9

శిష్యుడు : గురుదేవా! తప్పులెన్ను విషయమున మీ అవగాహ నను అనుగ్రహింపుడు.

గురువు : తప్పు లెన్నువారు తమ తప్పు లెరుగరు. వీరు మూర్ఖులు.

తమ తప్పులెరుగువారు గుణవంతులు. వాటిని సరి చేసుకొన్నచో సత్సాధకు లగుదురు. ఇతరుల తప్పు లను గమనించి అట్టి తప్పులు తమయందు కూడ యున్నవేమో అని పరిశీలించుకొనువారు విశేష గుణ వంతులు. అట్లు తమను తాము సరిచేసుకొను ప్రయత్నమున నుండుటచే ఉత్తీర్ణులగుదురు.

## ⑩

శిష్యుడు : గురుదేవా! మీ వద్ద మాకు విద్యలు సిద్ధించుటకు వలసిన ప్రధాన దీక్ష ఏది?

గురువు : వినయము. వినయములేని విద్యావంతుడు వింత పశువు. వినయ మున్నచోట అహంకారము నిలువ జాలదు. అహంకార మున్నచోట విద్య రాణింపదు. మేఘమున్నమేర ఆకాశము గోచరింపనట్లుగ, అహంకార మున్నచోట విద్య భాసించదు.

## ⑪

శిష్యుడు : సత్యశోధనకు సంఘ పరిస్థితులు ప్రతికూలము గదా! సంసారము, సమాజము, సంప్రదాయము ఇత్యాదివి ఒక రకముగ ఆటంకములే అనిపించుచున్నవి. దీనికి సులభమగు పరిష్కారమేమి?

గురువు : ఆటంకములు బాహ్యమున లేవు. నీ మనస్సున యున్నవి. నీ సాధనకు ప్రపంచము ఆటంకము కాదు. మనస్సున గల విషయాసక్తిని విషమని భావించి, కర్తవ్యోన్ముఖుడవైనచో మార్గము నిరాటంక మగును. విషయానురక్తి అందిరికిని పతన కారణమే.

## 12

శిష్యుడు : గురుదేవా! ఎంత పఠించినను, పరిశోధనము చేసినను ఋషిప్రోక్తమగు గ్రంథములు అవగాహన మగుట లేదు. నాకేమి మార్గము?

గురువు : గ్రంథములు పఠించుట, పరిశీలించుట, పరిశోధన చేయుట కన్న, నిన్ను నీవు పఠించుము. నిన్ను నీవు పరిశీలించుకొనుము. నీలోనికి ప్రవేశించి పరిశోధింపుము. నీలోనికి నీవెంత చొరబడినచో అంత నీకు అవగాహన పెరుగును. గ్రంథ పరిశోధనము పండితులకు వదలివేయుము.

# 13

శిష్యుడు : గురుదేవా! నాలోని వెలుగు నా కెట్లు గోచరమగును?

గురువు : అదట్లుండనిమ్ము. ముందు పొయ్యిని రాజేయుము. వేడి తేనీరు త్రాగుదము.

శిష్యుడు పొయ్యిని రాజేయ పూనెను. కాని పొయ్యి యందు ఒక్క నిప్పుకణిక కూడ లేదు.

శిష్యుడు : నిప్పుకణ మొక్కటి కూడ పొయ్యిలో లేదు. పొయ్యి రాజేయుట ఎట్లు?

గురువు : పొయ్యిని లోతుగ కెలికినచో తప్పక చిన్న నిప్పు కణికయైనను గోచరించును. (ఇదిగో చూడుము అనుచు అతిచిన్న నిప్పుకణికను వెలికితీసెను.)

శిష్యుడు : అవగతమైనది. మరింత లోతులలోనికి నేను చనినచో నాలోని వెలుగు గోచరింప గలదు.

గురువు : ఆ పనిమీదుండుము.

(14)

శిష్యుడు : గురుదేవా! మీరు సాధించిన సత్యస్థితి మాకెప్పటికి సాధ్యమగును?

గురువు : సాధించుట అను ప్రయత్నము ఒక భ్రాంతి. సాధించుట అని ఏమియు లేదు. మరచిన విషయము తటాలున గుర్తు వచ్చును. అందు సాధించుట ఏమున్నది? ఎంత గుర్తు తెచ్చుకుందమనుకున్నను గుర్తురాని ఒక విషయము, తనంతట తానుగ గుర్తు వచ్చుట అనుగ్రహమే గదా! కారణమునకు, దేశమునకు, ప్రయత్నమునకు అతీతముగ అనుగ్రహ మున్నది. నీకును అనుగ్రహ విశేషముగ వలసినది గుర్తుకు రాగలదు. సాధన నీ వశము. సిద్ధి దైవ వశము.

## (15)

శిష్యుడు : గురుదేవా! ధ్యానమునకు నేలపై కూర్చుండుట, పద్మాసనమున కూర్చుండుట ఇత్యాదివి ప్రధానమా?

గురువు : మనసును హృదయమున లగ్నము చేయుట ప్రధానము. లేదా భ్రూమధ్యమున లగ్నము చేయుము. ఇతర విషయములు అప్రధానములు. హృదయమునందు, భ్రూమధ్యము నందు గూడ పద్మమున్నది. అందాసీనుడవైనట్లు భావింపుము. అట్లాసీనుడవై గమనించుము.

## (16)

శిష్యుడు : గురుదేవా! మీ మిత్రులొకరు మేము చేయు సత్కార్యములు శాశ్వతము కాదు అనినారు. అది సత్యమా?

గురువు : నీవు శాశ్వతుడ వైనపుడు, నీవు చేయు పని, నీవు మాట్లాడిన మాట శాశ్వతమై నిలచును. నీవు శాశ్వతుడ వగునంత వరకు నీవు చేయు పనులు నీవలెనే అశాశ్వతములు.

## 17

శిష్యుడు : గురుదేవా! స్వప్నమున మీ దివ్య దర్శనము లభించి సంవత్సరమైనది. ఆ దర్శనమునే నెమరువేయుచు పునర్దర్శనమునకై ఎదురు చూచుచుంటిని. మరల నా కట్టి దర్శనము జరుగలేదు. నాలోని లోపమేమి?

గురువు : గతమునం దుండిపోవుటయే లోపము. దర్శనము మెఱపు వంటిది. సాన్నిధ్యము అనునిత్యము లభించునది. ప్రస్తుతమున లభించు సాన్నిధ్యము ననుభవింపక, గతమున నుండిపోయితివి. మనసు గతమునందో, భవిష్యత్తునందో నీ ప్రజ్ఞను నిలిపి, ప్రస్తుతమును మరతువు. సాన్నిధ్యము నిత్య నూతనము, శాశ్వతము. అందుండుట నేర్చుము. గతించిన విషయములు మరణము వంటివి. శవముల చుట్టూ తిరుగక ప్రస్తుతమున గల సాన్నిధ్య మనుభవింపుము. అదియే శివము. అదియే సుందరము. అదియే శాశ్వతము. అదియే సత్యము.

## (18)

శిష్యుడు : గురుదేవా! మహాత్ములు ఆకాశగమనము చేయుచుందురట! వారిని గూర్చి పఠించితిని. వారి బోధనలను కూడ వివరముగ పఠించితిని. వారికి ఆకాశగమనము ఎట్లు సాధ్యపడినది?

గురువు : నాకును, నీకునుకూడ ఆకాశగమనము సాధ్యమే. దాని కుపాయము నీలోనికి నీవు చనుటయే. మరియొక మార్గము లేదు. నీలోనికి నీవు చనినపుడు నీ హృదయమందు ఆకాశము దర్శింపబడును. అందు చరించుట సంభవించును. అపుడే వారును, వారి బోధనములు నీకు నిజముగ దర్శనమీయగలవు. వారిని గూర్చిన కథలు, వారి ప్రబోధములు నీవు నీలోని కేగుటయే సూచించును. లోని కేగుము. గంభీరమగు నీ లోతుల లోనికి నీవేగినచో సర్వము తెలియును.

## (19)

శిష్యుడు : గురుదేవా! సత్యమొక్కటియే అయినపుడు దానిని పలురకములుగ వివరించుటెందులకు?

గురువు : పలు ప్రాంతములు, పలు భాషలు, పలు సంప్రదాయములు ఉండుటవలన సత్యము దేశమును, కాలమును బట్టి పలు దుస్తులు ధరించినది. పలు రకముల దుస్తులు, పలు సమయములలో నీవు ధరింతువు. కాని నీ ఒక్కడివే కదా! అట్లే సత్యము కూడ ఒక్కటియే. దుస్తులను చూడక, దుస్తులు ధరించిన వానిని చూడుము. భాషలు, సంప్రదాయములు చూడక, అందు దాగియున్న సత్యమును చూడుము. లోదృష్టి లేనివారికి జ్ఞానమబ్బదు.

## 20

శిష్యుడు : గురుదేవా! మీ సన్నిధిని చేరి పన్నెండు (12) సం॥లు అయినది. నాకెట్టి వికాసము కలిగినదో నాకే తెలియుట లేదు. కలిగిన అనుభూతులు భ్రమయో, భ్రాంతియో, సత్యమో తెలియుట లేదు. అంతయు అయోమయముగ నున్నది. కారణమేమి?

గురువు : నిన్ను గూర్చి నీవు భావించుటయే కారణము. నీవే నీ వికాసమునకు అడ్డుగోడవలె నిలచినావు. నిన్ను నీవు మరచు వరకు ఆశ్రమమున శ్రమించుము. అదియే పరిష్కారము.

## 21

శిష్యుడు : గురుదేవా! మీ భాషణమునందు హాస్యము తరచుగ గోచరించు చుండును. చతురోక్తు లుండును. మీరు మనసార నవ్వుచుందురు. మీ ఈ లక్షణములకు మూలమేమి?

గురువు : అమితమైన బాధలు, బరువులు, నిందలు అనుభ వించుట వలన ప్రపంచమున తేలికగా నుండుట నేర్చితిని. నవ్వుట వలన సన్నివేశములు తేలికగును. చతురోక్తుల వలన, హాస్యము వలన మీరును తేలికగు చున్నారు. సంసారమున మునగకుండ నుండుటకు హాస్యము పట్టుకొమ్మ వంటిది. కష్ట నష్టము లందు, దుఃఖములయందు కృంగకుండు టకు హాస్యము ఒక వరముగ లభించును. కష్ట నష్టములు లేని జీవితములో సముచితము, సహజ మగు హాస్యముండదు.

## (22)

శిష్యుడు : గురుదేవా! బుద్ధిమంతుడనగా ఎవరు?

గురువు : బుద్ధియనగా వెలుగు. అది ఆత్మయొక్క వెలుగు. ఆ వెలుగు నందు వసించువాడు బుద్ధిమంతుడు. మనసునందు వసించువాడు మానవుడు. అతడు నశించును. బుద్ధియందు వసించువాడు నశింపడు. అతడు నరుడు.

## (23)

శిష్యుడు : గురుదేవా! బుద్ధి యందెట్లు ప్రవేశింపవచ్చును?

గురువు : నీయందలి ఎరుకనంతను ఒక దండముగ భ్రూమధ్యము నుండి మూలాధారము వరకు సమీకరణము చేయుము. దానిని సమీపించి, దాని యందు ప్రవేశించి, దండము యొక్క అగ్రమును చేరి ఎరుకను అక్కడనే యుంచుటకు ప్రయత్నించుము. అభ్యాసవశమున ఇది సిద్ధించును. అట్లు సిద్ధించుట వలన బుద్ధియందుండుటకు సాధ్యపడును.

## 24

శిష్యుడు : గురుదేవా! కుండలినీ చైతన్యము ప్రచోదనము చెందుటకు సులభమగు ఉపాయమేది?

గురువు : నీ యందలి ప్రాణము, ప్రజ్ఞ యోగము చెందునపుడు కుండలిని ప్రచోదనమగును. ప్రజ్ఞను ప్రాణముతో చేర్చుటగాని, ప్రాణమును ప్రజ్ఞతో చేర్చుటగాని ప్రధానము. ప్రజ్ఞా ప్రవాహము, ప్రాణ ప్రవాహము యోగము చెందుటయే కుండలినీ ఉద్బోధనమునకు ఏకైక ఉపాయము.

# 25

శిష్యుడు : గురుదేవా! నిజమగు యోగసిద్ధి ఏమి?

గురువు : సాక్షీభూతుడుగ సమస్తమును గమనించుటయే యోగసిద్ధి. తనయందు, తన పరిసరములయందు జరుగుచున్న చైతన్య విలాసమును గమనించువాడు పూర్ణయోగి. తినుచున్నపుడు, త్రాగుచున్నపుడు, తనయందు భావములు కలుగుచున్నపుడు, తాను భాషించు చున్నపుడు, చూచు చున్నపుడు, విను చున్నపుడు తనను తాను గమనించుట వలన, నిద్రించు చున్నపుడు కూడ తన శరీరమెట్లు పడి యున్నదో గమనించుట పూర్ణసిద్ధి. శరీరమునుండి తాను వెలువడుచున్నపుడు కూడ గమనించుట అట్టివానికే సాధ్యము.

## 26

శిష్యుడు : గురుదేవా! ఆత్మవికాసము కలుగుటకు సూటియగు ఉపాయమేమి? మిమ్ములను అనుకరించుచు, అనుసరించుచు నున్నవారిలో ఎవరైన ఆత్మవంతు లైనారా?

గురువు : అనుకరించుట, అనుసరించుట ప్రాథమికములు. వాని వలన ఆత్మవంతులు కాలేరు. నావలెనే వారును తమను తాము త్రవ్వుకొనుచు, తమ మూలమునకు చేరుటకు ప్రయత్నింపవలెను. తన మూలము తాను చేరినవాడే ఆత్మవంతు డగును.

## 27

శిష్యుడు : గురుదేవా! మన గ్రామపు కుమ్మరికి అకస్మాత్తుగ ఆత్మవికాసము కలిగినదట! అదెట్లు సాధ్యము?

గురువు : సాధ్యమే! ఎవరికెప్పుడు, ఎక్కడ, ఏ విధముగ ఆత్మ సాక్షాత్కారము లభించునో ఎవరు చెప్పగలరు? కుమ్మరి లోపల బయట కూడ పనిచేయును. ఒక చేయిని చేయబోవు కుండ లోపల దన్నుగ పెట్టి, మరొక చేతితో బయట నుంచి మట్టికి రూపము కల్పించును. రెండు చేతులు బయట యున్నచో కుండ ఏర్పడదు. కుండ నిర్మాణమునకు లోపలి చేయి ఎట్లో, అట్లే లోపల గమనించుచు నుండు సాధనయే ఆత్మ సాక్షాత్కార విద్యకు బలము.

(28)

శిష్యుడు : గురుదేవా! మా యందు మీరు నిర్వర్తించు ప్రధాన మగు కర్తవ్యమేమై యున్నది?

గురువు : మీ బలహీనతలపై పనిచేయుటయే మా పని. మీ బలహీనతలే మీకపాయకరము. వాని నుండి మీ కపాయ మెప్పుడును పొంచి యుండును. లోహ పాత్రల రంధ్రములను పూడ్చు పని మా పని.

## (29)

శిష్యుడు : గురుదేవా! శిలువ మోయుచున్న ఏసుక్రీస్తు సందేశ మేమి?

గురువు : మానవు లందరును శిలువ భారమునకు నశించు చున్నారని, దానిని మోయు ఉపాయము తన దగ్గర ఉన్నదని సందేశము.

మానవుని మనస్సే అతని శిలువ. ఒక శిలువయందు ఒక భుజము మరియొక భుజమునకు అడ్డముగ నుండును. మానవుని యందు ద్వంద్వ భావము లుండును. వాటియందు ఘర్షణ యుండును. భావములయందు పొంతన యుండదు. అట్టి ఘర్షణాత్మక మనస్సును భరించుటకు ఉపాయము తనవద్ద యున్నదని తెలుపుచున్నాడు.

## 30

శిష్యుడు : గురుదేవా! ఎడమ చేయి వాటము శుభమా, అశుభమా?

గురువు : కుడి ఎడమైతే పొరపాటు లేదు. కుడిచేతి వాటము సామాన్యము. ఎడమచేతి వాటము అసామాన్యము. అట్టి వారియందు అసామాన్యము, అనూహ్యము అగు ప్రజ్ఞ యుండును. వారెచ్చటనైనను అనూహ్య రీతిలో కార్యసిద్ధిని బడయుగలరు. క్రీడలలో కూడ వారిదే పై చేయి. వామదేవ, వామాక్షి, వామన ఇత్యాది పదముల యందు అనూహ్యత ప్రధానమై యుండును.

## 31

శిష్యుడు : గురుదేవా! దివ్య స్ఫూర్తి, దివ్య దర్శనము కలిగిన తరువాత సాధనయందు అడ్డంకులు, అంతరాయములు ఇత్యాది వేర్పడి వృద్ధి కలుగకున్నది. మీ సాంగత్యము లభించి పుష్కరము దాటినది. సాధనల గూర్చి నాకు తృప్తి కలుగుట లేదు. కారణ మేమియో తెలియుట లేదు?

గురువు : స్ఫూర్తి, దర్శనము కలుగకముందు నీ యందు స్థిరపడి యున్న పూర్వవాసనలే కారణము. అవి బలముగ నుండి నీవు నిర్వర్తించుచున్న యోగాభ్యాసమునకు తావివ్వవు. కలుపుమొక్కల నడుమ జనించిన పూలమొక్క పెరుగుటకు కలుపు నను నిత్యము తీయుచుండవలెను. కలుపుకున్న బలము అపుడే జనించిన మొక్క కుండదు. తోటమాలివలే కలుపును తీయుచు మొక్కను పెంచుము.

(32)

శిష్యుడు : గురుదేవా! మీరెన్నడును వింతలు చూపరా?

గురువు : వింతలు ప్రపంచమునకు సంబంధించినవి. సత్యము తదతీతమైనది. వింతలు కోరువారు చిన్న పిల్లల వంటివారు. వింతగోరు మనస్సు కుతూహలమున పడును. ఆత్మాన్వేషణమునకు దూరమగును. వింత యగు బంగారులేడిని కోరిన సీతమ్మ రామునికి దూరమైనట్లే, వింతలయందాసక్తి గలవారు సత్యమునకు చాల దూరమై యుందురు.

(33)

శిష్యుడు : గురుదేవా! మనోవికాసము కొరకేనా విద్యా భ్యాసము?

గురువు : సంస్కారము కొరకు విద్య. సంస్కరింపబడని మనసు విద్యాబలమున అసురత్వమును పొందును. దేహావశ్యకతలు దేహ మెరుగును. దానికి విద్యతో సంబంధము లేదు. జంతువులు కూడ విద్యావ సరము లేకయే దేహమును ఆరోగ్యకరముగ పోషించుకొనుచున్నవి. మనోవికాసము కన్న మనో సంస్కారము ముఖ్యము. సంస్కరింపబడిన మనస్సు నకు ఆత్మ స్ఫురణ, ఆత్మ బోధ అందును. అదియే విద్యయొక్క పరమ ప్రయోజనము.

(34)

శిష్యుడు : గురుదేవా! సాధన సుగమ మగుటకు ప్రధాన గుణ మేమి?

గురువు : జిజ్ఞాసత్వము. ఆత్మజిజ్ఞాస ఆకలిదప్పుల వలె అత్యంతావశ్యకము కావలెను. దేహము తనకు కావలసిన దానిని ఎప్పటికప్పుడు గుర్తు చేయును. అట్లే జీవాత్మ తపనతో ఆత్మను గూర్చి తహ తహ లాడినచో సాధన సుగమ మగును. విషయ సేకరణము మాని ఆత్మచింతన యందు నిమగ్నుడ వగుము.

## 35

శిష్యుడు : గురుదేవా! మీరు జ్ఞానవృద్ధులు. వయో వృద్ధులు కూడ. అయినప్పటికి తరచుగ మీరు పసిపిల్లలవలె అమాయకముగ ప్రవర్తింతురు. తెలిసినవారు అమాయకులవలె ఎట్లుండగలరు?

గురువు : చిన్నతనమున నీకును, నాకును ఏమియు తెలియవు. అటుపైన నీకును, నాకును తెలియ వచ్చినది. నీవు తెలివియందే యున్నావు. నాకు వచ్చిన తెలివి పోయినది. వచ్చి పోయే తెలివి మాయ. నిన్ను కమ్మిన మాయ నీతో యున్నది. నన్ను కమ్మిన మాయ నన్ను వదలిపోయినది. కనుక మరల పసివాడ నయ్యాను.

## (36)

శిష్యుడు : గురుదేవా! అన్నిటికిని మూలమేది?

**గురువు : ఉదయము హోమమున అగ్నిజ్వాలను చూచితివా?**

శిష్యుడు : చూచితిని.

**గురువు : ఆ అగ్నికి మూలమేమి?**

శిష్యుడు : సమిధలు

**గురువు : సమిధలో అగ్ని ఎట్లు చేరినది?**

శిష్యుడు : (మౌనము వహించెను)

**గురువు : నీలోనికి చనుము. అపుడగ్ని మూలము తెలియును. నీకు తెలియుటకు ఒక తెలివి పనిచేయు చుండును. ఆ తెలివికి మూలమేమో ధ్యానింపుము. అపుడన్నియు తెలియగలవు.**

## 37

శిష్యుడు : గురుదేవా! సమాజ హితము కోరు మీరు చేయు చున్న కొన్ని కార్యములు సమాజమున ప్రకంపన ములు కలిగించు చున్నవి. ఆ కార్యములను సమాజము అంగీకరించుట లేదు.

గురువు : సమాజ హితము కోరువాడు సమాజము అడుగులకు మడుగు లొత్తుచుండుట కుదరదు. పిల్లలు కోరిన దెల్ల పెద్దలు చేతురా? వారి హితము కోరి శిక్షణ నిచ్చు చుందురు. అట్లే సమాజ హితము కోరి, అందు పేరుకొని, కరడు గట్టిన దురాచారములను, మాలిన్యములను నిష్కర్షగ నిర్మూలించు చున్నాను. రోగగ్రస్తునకు ఒక్కొక్కమారు చేదుమందు తప్పదు.

## 38

శిష్యుడు : గురుదేవా! మీరెన్నియో సద్విషయములు బోధింతురు. వానిని లిఖించ వద్దని, విని ఆకళింపు చేసుకొనుడని తెలుపుదురు. మీకుగ ఏమియు రచింపరు. మరి భవిష్యత్తున ఇట్టి జ్ఞానము తెలియగోరువారు ఎట్లు తెలియగలరు?

గురువు : భవిష్యత్తున ఎవరికెట్టి జ్ఞాన మవసరమో అట్టి జ్ఞానము తప్పక లభింపగలదు. ఇప్పటి జ్ఞానమప్పటికి వినియోగ పడగలదని వ్యామోహ పడరాదు. నూతనముగ ఏతెంచు జాతికి, నూతనముగ బోధనలు కూడ అందింపబడును. పాతజ్ఞానముతో క్రొత్తవారిని కట్టివేయరాదు. క్రొత్తగ పుట్టు వారికి చనిపోయిన వారి జ్ఞాన మందించుట నా దృష్టిలో నిరుపయోగము. ఎవరి కెప్పుడు ఏది అవసరమో తల్లియగు ప్రకృతికి తెలియును.

## 39

శిష్యుడు : గురుదేవా! శుకుడాదిగాగల మహర్షులు, జైనమత తీర్థంకరులు నగ్నముగ చరించెడిలోని రహస్యమేమి?

గురువు : అత్యంత ధీరులే నగ్నముగ చరింతురు. బ్రహ్మ చర్యము పరిపూర్ణమైనపుడే నగ్నత్వము సిద్ధించును. అత్యంత ఆకర్షణీయమగు సందర్భమున కూడ కామప్రేరణ కలుగనివారే నగ్నులుగ ఉండగలరు. తమయందలి ఏ కక్ష్య యందైనను కామప్రేరణ కలిగినచో అది పురుషాంగమున చలనము కలిగించును. అట్టి చలనము నగ్నులైన వారియందు ఇతరులు గుర్తింప వచ్చును. కనుక పూర్ణముగ బ్రహ్మము నందే సర్వకాల సర్వావస్థల యందు చరింతు మను ధీరత్వ మెవరికుండునో వారే నగ్నత్వమును ఆశ్రయింతురు. వారు పూర్ణముగ మాయను దాటినవారు. మాయ వారి దరిదాపులలో నుండదు.

# 40

శిష్యుడు : గురుదేవా! గౌతమబుద్ధుని కాలము నందు మహా వీరుడు కూడ వసించినాడట. వారిరువురు కలియుట జరుగలేదా?

గురువు : అవసరము లేదు గనుక కలియ లేదు. పూర్ణజ్ఞానులు ఒకరినొకరు కలియవలసిన అవసరము లేదు. అవసరము లేకున్నా కలియుట మానవులకే పరిమితము. అంతేకాదు. అదే సమయమున మరియొక ఆరుగురు మహాత్ములు కూడ అదే స్థితి యందున్న వారు వసించి యుండెడివారు. వారారుగురు వారి చిహ్నములను కూడ భూమిపై నిలుపక సిద్ధిని పొందిరి. మహాత్ములు వారి యునికిని గుప్తము చేయుదురుగాని, ప్రకటించుకొనరు. గౌతమ బుద్ధుడు, మహావీరుడు కూడ మితభాషులే.

(41)

శిష్యుడు : గురుదేవా! ఎరుకతో నున్నవాడు కదలికలో యుండుట సహజము. ఎరుక లేనివానికి కదలిక లేదు. ఎరుకలో నుండి, కదలిక లేకుండుట ఎట్లు?

గురువు : కదలిక లేని ఎరుకతో కూడియుండుటయే సమాధి స్థితి. అట్టి స్థితి ఆధారముగ ఇతర చిల్లర కదలికలు జరుగును. కదలిక లేని ఎరుకయే ఘనచైతన్యము. అది వెండితెర వంటిది. దానిపై కదలిక లుండ వచ్చును. కాని వెండితెర కదలదు. వెండితెరపై కదలికలకు కదలని వెండితెరయే ఆధారము. కదులుచున్న ఎరుకకు ఆధారముగ కదలని, మెదలని ఎరుక ఉన్నదని తెలియుటయే నిజమగు జ్ఞానము. అట్లు తెలిసినవారే మహాత్ములు.

(42)

శిష్యుడు : గురుదేవా! సహజ సమాధి ఎట్లుండును?

గురువు : అనుభవించిననే తెలియును. అవగాహనకు ఉదాహరణ మిత్తును.

1) పూర్ణచంద్రుడు సరస్సున వెలుగొందు చున్నాడు. చంద్రుడు ప్రతిబింబించ వలెనని సంకల్పించ లేదు. సరస్సు చంద్రుని ప్రతిబింబించ వలెనని అనుకొన లేదు. ఇరువురు కోరి ఏమీ చేయలేదు. ఎవరికి వారుగ నున్నారు. పూర్ణ చంద్రకాంతి పౌర్ణమినాడు చంద్రునికి సహజము. కాంతిని వెండివలె ప్రతిబింబింప చేయుట సరస్సునకు సహజము. అందుండి పుట్టిన సుందరమగు ప్రకృతి, ఆహ్లాదము సహజము. తమయందు తాముండుట వలన అట్టి ఆహ్లాదము జనించినది. సహజ సమాధి అట్లుండును.

2) నీవు నడచినపుడు నడచు చున్నట్లుగ గమనించు చున్నావా? మాటాడునపుడు మాటాడుచున్నట్లు గమనించు చున్నావా? తినుచున్నప్పుడు తిను చున్నట్లు గమనించు చున్నావా? నిశ్శబ్దముగ నున్నపుడు నిశ్శబ్దముగ నున్నట్లు గమనించు చున్నావా? ఎఱుకతో పనులు చేయు చున్నపుడు అట్టి ఎఱుకను గమనించు ఎఱుకయే సహజ సమాధి. అది నీవే!

# 43

శిష్యుడు : గురుదేవా! సాధారణముగ మీరు మౌనముగ ఏమి చేయుచుందురు?

గురువు : ఏమియు చేయను. నా యందు నేనుందును. నా ఎఱుక ఉనికితో కూడియుండును.

శిష్యుడు : అట్లయిన ఇన్ని పనులెట్లు జరుగుచున్నవి?

గురువు : నా నుండి ప్రకృతి నిర్వర్తించుచున్నది. కాలమును దేశమును బట్టి నాయందలి ప్రకృతి కార్యములు నిర్వర్తించు చుండగ నేను చూచుచు నుందును. నాయందు నేనుండి చూచుచు నుందును.

## 44

శిష్యుడు : గురుదేవా! మీరు ఒకే ప్రశ్నకు ఒక్కొక్క రోజు ఒక్కొక్క సమాధానమిత్తురు. మొన్నటి సమాధాన మొకటి, నిన్నటి సమాధాన మింకొకటి. నేటి సమాధానము మరియొకటి. ఇది ఏమి వింత?

గురువు : ఏ దినమున కాదినము నిత్యనూతనము. మొన్నటి వలె నిన్న లేదు. నిన్నటివలె నేడు లేదు. నేటివలె రేపుండదు. ఇది సత్యము. కాలము దేశము ఏర్పడి నపుడు మార్పు చెందుచుండును. తదనుగుణముగ ప్రజ్ఞకూడ నవనీతమై యుండును. అనగా ఎప్పటి కప్పుడు అవతరించు చుండును. అట్లుండుట జీవనము. మొన్నటివలెనె, నిన్నటివలెనె నేడు కూడ యుండుట యాంత్రికము, అసహజము. జీవుడు మరమనిషి కాదు కదా! యంత్రము కాదు కదా! కాలమును దేశమును బట్టి సర్దుబాటు చెందు ప్రజ్ఞ నిత్యనూతనమై యుండును. నేను నడుపునది

విద్యాలయము. పాఠశాల కాదు. ఇచ్చట గొఱ్ఱెల మందలుగా గాక విద్యార్థులు నిత్యనూతన తేజో వంతులై యుండవలెను.

## (45)

శిష్యుడు : గురుదేవా! తురీయస్థితి అనగానేమి?

గురువు : తురీయస్థితి మన నిజ స్థితి. అది మన మూల స్థానము. ఆ స్థితి యందు మనము నిశ్చలముగను, శాశ్వతముగను, పరమానందముగను యుందుము. అందుండి ప్రతినిత్యము మూడు అవస్థలలో ప్రవేశించి నిష్క్రమింతుము.

**1)** మెలకువ యందు ప్రవేశించి నిష్క్రమింతుము.

**2)** నిద్ర యందు ప్రవేశించి నిష్క్రమింతుము.

**3)** స్వప్నమునందు ప్రవేశించి నిష్క్రమింతుము.

ఈ మూడు స్థితులును తాత్కాలికము. వీటియందు ప్రవేశించుట, నిష్క్రమించుట యుండును. తురీయ మందు ఎప్పుడునూ యుందుము. ఎఱుకతో యుందుము. అదియే మోక్షము. అదియే పరము. అదియే అక్షరము. అదియే బ్రహ్మము.

## 46

శిష్యుడు : గురుదేవా! మీ దినచర్య అంతయు ధర్మకార్యము లతో కూడి యున్నది. ఆరాధనము, బోధనము, దానము, హితబోధ ఇత్యాది కార్యములతో నిండి యున్నది. దీనిని క్రమబద్ధము చేయుటకు ధర్మ సంస్థ నొకటి ఏర్పరచవచ్చును గదా!

గురువు : సంస్థలు అవస్థలకు మూలము. అవి శరీరముల వంటివి. ఈ శరీరము నందుండుటయే ఒక అవస్థ. ఇందు తేలికపడి తేలియున్నాను. మరల సంస్థలు పెట్టి అవస్థలు పడుట తేలియున్న వానికి తగదు. సంస్థలనగానే కొన్ని హక్కులు, బాధ్యతలు, ఒకరి నడుమ ఒకరికి పోటీ- ఇత్యాదివి సహజముగ ఏర్పడును. ఒక జాలమునుండి బయట పడినవాడు మరియొక జాలమున పడుట అవివేకము. తథా గతుడనై పోవుటయే నాకు సమ్మతము.

## 47

శిష్యుడు : ఈ రోజున ఒక పెద్ద మనిషి మీతో వాగ్వివాదము గావించి, మిమ్ములను విమర్శించి దూషించినాడు. మీరు మౌనముగ ఉండిపోయితిరేమి?

గురువు : నిన్న ఒక కుటుంబము ఏతెంచి వస్త్రములు, పండ్లను యిచ్చి నమస్కరించి ప్రశంసించిరి. అవన్నియు ఆశీఃపూర్వకముగ వారికే తిరిగి యిచ్చితిని.

మొన్న ఒకరు కొంత ధనము, వస్తువులు యిచ్చి వెళ్లిరి. ఆ రోజు సాయంత్రము లోపల అన్నియును పంచివేసితిని.

నా వద్దకు ఏమి వచ్చినను వెళ్ళిపోవునే గాని ఉంచు కొనను. ఈనాటి విమర్శలు, దూషణములు కూడ అంతే.

ఆకాశముపైకి ఏమి విసిరినను భూమిపైనే పడును. ఆకాశము ఆకాశముగనే యుండును.

## 48

శిష్యుడు : గురుదేవా! నా నిద్రయందు నన్నెవరో తట్టి లేపు తున్నట్లు అనిపిస్తుంది. లేచి చూడగ, గదిలో ఎవ్వరూ ఉండరు. వేసిన గడియ వేసినట్లే యుండును. ఇప్పటికి మూడు మార్లు అట్లు జరిగినది. ఎవరో అదృశ్యముగ ప్రవేశించి నన్ను తట్టి, నిద్రలేపి నేను కనులు తెరిచే సరికి మాయమగు చున్నారు. ఇదియేమై ఉండవచ్చును?

**గురువు** : (గురువుగారు పక పకా నవ్వారు.)

శిష్యుడు : దయచేసి నవ్వకండి. నాకాందోళనగ నున్నది.

**గురువు** : **నీ లోతట్టున నుండి 'నేనే' మేల్కొల్పుచున్నాను. పై తట్టు నుంచి అని నీవు భ్రమపడు చున్నావు. తట్టి లేపబడినపుడు లోనికి చూడుము. బయట వెతక బోకుము. నీలోని 'నేను' నిన్ను మేల్కొల్పి క్రమముగ నిన్ను 'నా' యంత వానిని చేయుదును.**

(49)

శిష్యుడు : గురుదేవా! బ్రహ్మంగారి శిష్యులిద్దరు మేము నిజమగు అనుచరులమని, కాదు మేమని గింజులాడుకొనుచున్నారు. ఇది యేమి చిత్రము!

గురువు : చిత్ర మేమీలేదు. అది సహజము. గౌతమబుద్ధుని శిష్యులు గౌతము డందించిన సత్యమును అందించుటకు ముప్పదిమూడు (33) శాఖలుగ విడిపోయినారు. దర్శనమును బట్టి సత్యము నిర్వచించబడుచుండును. సాన్నిధ్యము లభించువరకు ఒకే సత్యము అనేకమై గోచరించును. సాన్నిధ్యమున మాత్రమే అన్నియు ఒకటేయని తెలియును. అంతవరకు సత్యము పేరున మతము లుండును. వాదము లుండును. విభేదము లుండును.

## 50

శిష్యుడు : గురుదేవా! మీ ప్రవర్తనము మాకప్పుడప్పుడు విస్మయము కలిగిస్తూ ఉంటుంది. అనూహ్యమైన విధంగా ప్రవర్తిస్తూ ఉంటారు. ఎందుకు అలా జరుగుతుంది?

గురువు : నేనొక పిచ్చివాడిని. కాస్తోకూస్తో పిచ్చి లేకపోతే ఈ ప్రపంచంలో ఉక్కిరి బిక్కిరి అయిపోతాం. పిచ్చివాని కున్న ఆనందం, పిచ్చివాడిని కాను అనుకున్న వానికి లేదు. నిజానికి మీరందరు పిచ్చివాళ్ళే! యాంత్రికంగా జీవిస్తూ ఉంటారు. అలా జీవించని వాళ్ళని చూచి పిచ్చివాళ్ళనుకొనే నిజమైన పిచ్చివాళ్ళు మీరే!

(51)

శిష్యుడు : గురుదేవా! ఆత్మజ్ఞానము సంభవించినపుడు కలుగు ప్రథమ పర్యవసానమేమి?

గురువు : ఆత్మజ్ఞానము అనుగ్రహ వశమున కలుగును. అనుగ్రహమునకు తీరు తెన్నులు లేవు. అది అకస్మాత్తుగ సంభవించును. అది సంభవించినపుడు పూర్వజ్ఞానము ఆవిరైపోవును. పూర్వస్థితి అదృశ్యమై నూతన స్థితి ఏర్పడును. భాషణము మూగపోవును. నిశ్శబ్దము చాల కాలము ఆవరించి యుండును. క్రొత్త చిగురువేయుటకు మునుపు వృక్షమెట్లు బోడి యగునో అట్లు స్వభావము నిర్మలాకాశముగ, నిశ్చల ముగ, నిశ్శబ్దముగ, నిత్యనూతనముగ నుండును. గతమంతయు స్వప్నమై, ప్రస్తుతమంతయు నిర్మలమై యుండును.

(52)

శిష్యుడు : గురుదేవా! మౌన మెంతకాలము అభ్యసించవలెను?

గురువు : మనసు సద్దుమణుగు వరకు మౌనమభ్యసింపవలెను. మనసు చప్పుడు శ్రద్ధతో గమనించు వానికి క్రమముగ చప్పుడు తగ్గును. సణుగుడు తగ్గును. సద్దు మణుగును. నిజమగు మౌనమునకు ఫలమిదియే!

## 53

శిష్యుడు : గురుదేవా! మరణము ద్వారా అందివచ్చు సందేశ మేమి?

గురువు : మనిషి ఎట్లు జీవించెనో తెలియును. జీవించుట తెలిసిన వానికే మరణించుట కూడ తెలియును. అనాయాస మరణము లేనిచోట ఆ జీవితము ఆయాస పడినదని తెలియవచ్చును. జీవించుట అందరికిని చేత కాదు. కనుక మరణించుట గూడ ఆయాసముగ నుండును.

# 54

శిష్యుడు : గురుదేవా! మీ సిద్ధికి మీ గురువుగారే మీ ఉపాయ మని తెలుపుచుందురు. వారు మీ కేమి తెలిపినారు? వారు రచించిన విషయము లేమైనా యున్నవా?

గురువు : వారేమియు రచించలేదు. వారు 'ఉండుట' యందు సిద్ధహస్తులు. మమ్ములను కూడ ఉండుట నేర్చుడు అని తరచుగ హెచ్చరించెడివారు. ఉండుటయే సిద్ధి. "నాయందు నే నుండుట సిద్ధి."

(55)

శిష్యుడు : గురుదేవా! గౌతమబుద్ధుడు చివరి దశలో మౌనియై యుండెనట! కారణమేమి?

గురువు : అతడు సిద్ధి పొందినది మౌనము నందే! గౌతముడు బుద్ధుడైనప్పటి నుండి అతడు మౌనముగనే యుండెను. అతని నుండి దివ్యవాక్కు ప్రబోధ ములు చేయుచున్నప్పుడు కూడ అతడు మౌనము గనే దర్శించుచుండెను. దివ్యవాక్కు తన కర్తవ్య మును నిర్వర్తించి అంతర్ధానమైనపుడు కూడ అతడు మౌనముగనే యుండెను. దేహ త్యాగ సమయము నందు, అటుపిమ్మట గూడ అతడు మునిగనే యుండెను. నేటికిని అతడు మునియే. అతడు మునీంద్రుల కోవకు చెందినవాడు. తనయందు తానుండు వాడు ముని.

## 56

శిష్యుడు : గురుదేవా! మారకదశ చేరినవాడు తన రాజ్యపు పొలిమేర దాటినను, సన్యాసాశ్రమము స్వీకరించినను, తన ఊరు పేరు మార్చినను, రుద్రుని ఆరాధించినను, ఆ దశనుండి విముక్తు డగునని శాస్త్రజ్ఞులు తెలుపుచున్నారు. ఈ విషయమున మీరేమందురు?

గురువు : ఉన్నవాడు ఉన్నపళముగ, ఉన్నచోట తన లోనికేగినచో తనకు మరణము లేదని తెలియగలదు. ఇతర మార్గములో మరణము తప్పదు.

# 57

శిష్యుడు : గురుదేవా! ధర్మప్రచారము వలన జీవులు సిద్ధి పొందుదురా?

గురువు : ధర్మము నందున్నచో సిద్ధి పొందెదరు. ధర్మము తనకు తానుగ కాలమును బట్టి, దేశమును బట్టి ప్రచార మగుచుండును. తాను ప్రచారకు డనుకొను వాడు మోసపోవును. ధర్మము నందుండుటయే ధర్మ ప్రచారము. ప్రచారము కొరకు చేయు శ్రమ రజో దోషము వలన సిద్ధి నివ్వదు.

## 58

శిష్యుడు : గురుదేవా! అరువది నాలుగు (64) విద్యలు యున్నవని, వానిని తెలియుట వలన సిద్ధి లభించునని తెలుపుదురు. ఇందు ప్రధానమగు విద్యలేవి?

గురువు : తనను తానెరుగు విద్యయే నిజమగు విద్య. ఇతర విద్యలు విద్యార్థిని, తనకు తనని దూరము చేయును. తనను తానెరుగుటకు మార్గము తన లోనికి ఏర్పడి యున్నది. అది ఎప్పుడునూ యున్నది. అది సాధించునది కాదు. నీ యందున్నదే! కనిపెట్ట వలసినదీ కాదు. ఉన్నది ఉన్నట్లుగ చూచుటయే మార్గము.

## 59

శిష్యుడు : గురుదేవా! పర్వత దర్శనము ఎట్టి శుభ ఫల మిచ్చును?

గురువు : స్థిరత్వము, మౌనము నిచ్చునది అచలమగు పర్వతము. పర్వతము అధిరోహించుట, జెండా పాతుట కన్న పర్వత దర్శన స్పర్శనలచే స్థిరత్వము, మౌనము పొందుట శుభము.

## 60

శిష్యుడు : గురుదేవా! నారదమహర్షి సమస్త గురు పరంపరకు గురువై యున్నాడు గదా! అతడేల సతతము సంచరిస్తూ ఉంటాడు? ఒకచోట ఏల ఉండడు?

గురువు : పూర్ణ పురుషులకు సంచారము ప్రధాన లక్షణము. నారాయణుడే ఉత్తర దక్షిణ అయనములుగ నిత్య సంచారం చేస్తూ ఉంటాడు. నారదుడు కూడ అట్లే పదునాలుగు **(14)** లోకముల యందు నిత్యము సంచరిస్తూ ఉంటాడు. నిత్యము ప్రవహించే నదీ జలంలో జీవమెప్పుడూ ఉంటుంది. ప్రవహించని తటాకమందు అంత జీవముండదు. నిలువ ఉన్న చోట జీవము తక్కువగ నుండును. కనుకనే మహాత్ములు స్థిర నివాసులు కారు. వారికొక చిరునామా యున్నప్పటికి, అది నామమాత్రమే. వారు లోపల, బయట కూడ సంచారం చేస్తూ ఉంటారు. లోపల కాని, బయటకాని స్థిర నివాస ముండదు. ఎచ్చటనూ పాతుకొనిపోరు. విశ్వమే నివాసంగా జీవించువారే పూర్ణపురుషులు.

(61)

శిష్యుడు : గురుదేవా! మహాత్ములకు సమాధి ఏర్పాటు చేయాలా? అలా చేయకపోతే అపచారమా?

గురువు : ఈ భూమిపై అనేకానేక ఆచారము లున్నాయి. సతతము లోకశ్రేయస్సుకై సంచరించేవారు మహాత్ములు. దేహమున్నను లేకున్నను వారి సంచారము సాగుతునే యుండును. సమాధి కట్టినంత మాత్రమున వారు సమాధికే పరిమితము కాదు. దైవము దేవాలయమునకే పరిమితము కాదు గదా! సమాధులు, దేవాలయములు సామాన్యుల కొరకే. సర్వవ్యాపకము చెందిన ప్రజ్ఞకు సమాధులతో సంబంధము లేదు. వారికి దేహమున్నను లేకున్నను, సమాధి కట్టినను కట్టకున్నను ఒకటే. సనాతన ధర్మమున సమాధులకు పెద్ద విలువుండదు. సప్తర్షులు, రామకృష్ణాది అవతారమూర్తులు ప్రమాణముగ గలది సనాతన ధర్మము. వారెవ్వరికిని

సమాధులు లేవు. దేహమిచ్చిన దేవునికి, మరల దేహమును సమర్పించుటయే అగ్నికార్యము. అదియే సర్వోత్తమము. ఇతర విధానములు దానితో సాటిరావు.

(62)

శిష్యుడు : గురుదేవా! వికటముగ నవ్వు బుద్ధుని చిహ్న మెట్లేర్పడినది? బుద్ధుడు ఎన్నడును వికటాట్ట హాసము చేయలేదుగదా!

గురువు : లాఫింగ్ బుద్ధ (Laughing Buddha) ప్రస్తుతము అత్యంత ప్రాచుర్యము పొందినది. అతడే రాబోవు బుద్ధుడని, మైత్రేయ బుద్ధుడని తెలియవచ్చు చున్నది. ధ్యాన బుద్ధుని కన్న లాఫింగ్ బుద్ధుడు అధిక సంఖ్యలో గృహములను అలంకరించు చున్నవి. ఇదొక శుభపరిణామము. సత్యము కూడ.

పూర్ణజ్ఞానులు సతతము మందహాసము కలిగి యుందురు. ~~ఈ~~ విషయమై శ్రీకృష్ణుడే పరాకాష్ఠ. అతడు యుద్ధభూమి యందు కూడ నవ్వుచునే యుండెడివాడు. ఆధునిక యుగమున ఆత్మ సాధకులు నవ్వుచు, ఆడుతు, పాడుతు ఆత్మసాధన అవలంబించవలెనే గాని శుష్కించిన శరీరములతో,

గుంటకన్నులతో, తీవ్రముఖముతో సాధన చేయ వలసిన అగత్య మెప్పుడును లేదు. అది తెలుపుటకే మైత్రేయ బుద్ధుడు. బ్రహ్మానంద ప్రకాశముతో అవతరించు చున్నాడు. అతడు శ్రీకృష్ణుని అనుయాయియే కదా! హాసము లేని సత్యశోధనము వ్యర్థము.

## (63)

శిష్యుడు : గురుదేవా! ధ్యానమందు ఏమి చేయుట ఉత్తమము?

గురువు : ఏమీ చేయక "ఉండుట"యే ధ్యానము. ఏమి చేసినను అది ధ్యానమునకు విరుద్ధమే. ఏమియు చేయకుము. ఉన్నది గమనించుచు యుండుము. ధ్యానము జరుగునదే గాని చేయునది కాదు.

నిద్ర పోవుట కేమి చేయవలెను? ఏమి చేసినను నిద్ర దూరమే యగునుగాని, నిద్ర రాదు.

ధ్యానమునకు, నిద్రకు చేయుట అను ప్రక్రియ విరుద్ధము. ఏమియు చేయక 'ఉండుట' ఒక్కటే మార్గము. ఈ సుళువు తెలిసినవారికే ధ్యానము సిద్ధించును.

## 64

శిష్యుడు : గురుదేవా! చాలా కాలం నుండి ధ్యానం చేస్తున్నా దర్శనం కావటం లేదు.

గురువు : చేస్తున్నంత కాలం దర్శనం కాదు. చేయటం ఆపి చూస్తూ ఉండు. నీ కన్న మొండివాళ్ళు పూర్వకాలం చాల చేశారు. ఏమీ కాలేదు. జపం చేసినా, మంత్రం చేసినా, తంత్రం చేసినా, దానం చేసినా, అడవుల కేగినా, పర్వతాలు అధిరోహించినా, ఒంటికాలుపై తపస్సు చేసినా, తల్లక్రిందులుగా తపస్సు చేసినా, నీరు ఆహారం మానివేసినా, గ్రంథ పారాయణలు చేసినా, వేదములను రకరకాలుగా పలికినా, ఆత్మ దర్శనం కాలేదు. తాను ఎంత కావాలనుకున్నా, ఎన్ని ఉపదేశాలు పొందినా ఆత్మదర్శనం కాలేదు.

సాధకుడు ఎంతచేస్తే అంత కలిసొచ్చే విషయం కాదు ఆత్మ. ప్రపంచానికే ఆ సత్యం వర్తిస్తుంది. ఆత్మ దర్శనానికి కావలసింది చేయటం కాదు- చూడటం,

గమనించడం. చేయటం అలవాటైన మానవునికి ఇపుడు ఉండటం అలవాటు కావాలి. ఉండటం నేర్చుకుంటే, గమనిస్తుండటం నేర్చుకుంటే దర్శనం అయ్యే అవకాశం ఉంటుంది.

ఉదాహరణకు మర్చిపోయిన పేరు ఎంతగింజుకున్నా గుర్తుకు రాదు. ఆ ప్రయత్నం మానేస్తే, దానంతటదే ఎప్పుడో గుర్తువస్తుంది. గుర్తు తెచ్చుకుందామనే ప్రయత్నం గుర్తురావడానికి అవరోధంగా నిలుస్తుంది. వేచి ఉండు. గమనిస్తూ ఉండు. దానికోసం ప్రత్యే కించి ఏమి చేయక. చేయటమే అవరోధం. ఓపికతో గమనించడమే పరిష్కారం!

## 65

శిష్యుడు : గురుదేవా! దైవమంతటా ఉన్నాడంటారు. లోపల వెలుపల కూడ ఉన్నాడంటారు. నేనెంత ప్రయత్నం చేసినా నాకది అనుభవంలోనికి రావటం లేదు. సుళువైన మార్గం దయచేసి తెలపండి?

గురువు : మఱ్ఱి విత్తనంలో మఱ్ఱిచెట్టు దాగి ఉన్నది. మఱ్ఱిచెట్టు మహా వృక్షం. అది గోచరించాలంటే మఱ్ఱి విత్తనం నశించక తప్పదు. అలాగే నీయందు సర్వ వ్యాపకమైన దైవమున్నాడు. దాని కవరోధమై నీవే ఉన్నావు. నీవు మఱ్ఱిగింజవంటి వాడవు. నీ అహంకారము నశించినకొద్దీ, నీయందు దైవదర్శనం సంభవిస్తూ ఉంటుంది. అందుకనే “ఓం నమః” అనే మంత్రము పెద్దలు యిచ్చారు. అహంకారం నశిస్తే అంతా దైవంగానే కనిపిస్తుంది. నిన్ను నీవు చూసుకొనక, సమస్తమును చూడుము. అదియే మార్గము.

66

పండువృద్ధుడొకడు సద్గురువుని సమీపించి ఇట్లని విన్నవించెను.

"చిన్నతనము నుండి విప్లవాత్మక భావములతో సంఘము, సమాజములందు మార్పుగొనిరావలెనని ప్రయత్నించితిని. వివాహానంతరము నా కుటుంబ మాదర్శవంతముగ నుండవలెనని ప్రయత్నించితిని. వ్యక్తిగతముగ దృఢమగు శరీరము కలిగి సంపూర్ణ ఆరోగ్యముతో నుండవలెనని ప్రయత్నించితిని. అవి ఏవియు సిద్ధించ లేదు. నాకు పరిష్కారమేమి?"

సద్గురువు : నిన్ను నీవు మార్చుకొనక, నీ చుట్టును మార్పునకై ప్రయత్నించితివి. అది ఎన్నడును సాధ్యము కాదు.

వృద్ధుడు : విషయము అవగతమైనది. నాకేదైన ఉపదేశమిండు.

సద్గురువు : ఇత్తును. కాని నీకిక సమయము లేదు. పై జన్మకు ఉపయోగపడగలదేమో!

వృద్ధుడు : ధన్యోస్మి!

(67)

శిష్యుడు : గురుదేవా! నా అశాంతికి కారణమేమి?

గురువు : ఉన్నది నచ్చకపోవుటయే. ఉన్నది తృప్తి మానవునకు. లేనిది కోరుకొనుట వలన అశాంతి జనించును. ఉన్నవాడే జీవుడు. ఉన్నానుగదా అని తృప్తి పడును. ఉన్నందుకు కృతజ్ఞతతో నుండుము. నేనుండుట నేర్చితిని. తృప్తిగ నుండుట నేర్చితిని.

# 68

శిష్యుడు : గురుదేవా! పరమపదమును చేరుకున్న మీరు అవలంబించిన మార్గమేమి?

గురువు : దివ్య మార్గమని, యోగ మార్గమని, జ్ఞాన మార్గమని చాలా మార్గములలో పయనించి చివరికి పరమ పదము చేరుకున్నాను.

పరమపదము చేరిన పిదప అంతకు పూర్వము అవలం బించిన మార్గము లన్నియు పిల్ల చేష్టలుగ తోచినవి. నీవున్నచోటే దైవమున్నాడు. నీయందే యున్నాడు. నీవున్నచోట నీవు గమనిస్తే అచటే దైవము కూడ గోచరిస్తాడు. కాని జీవులకు గుణదోష ముండుటచేత, రజోగుణ ప్రేరితుడై అనేకానేక ప్రయత్నాలు చేస్తారు.

నీకు చేతనైతే నీయందు నీవెక్కడున్నావో గుర్తిం చుము. అక్కడే దైవము కూడ కనిపిస్తాడు. అది

చేతకాకపోతే గుణదోష పరిష్కారానికై అనేకానేక వృత్తులలో తిరిగి, మరల మొదటికి చేరతారు.

దైవమార్గం నిన్ను ఉన్నచోటుకే చేరుస్తుంది. అది వృత్తాకార మార్గము.

(69)

శిష్యుడు : గురుదేవా! ఈ మంచి చెడుల ప్రపంచంలో అంతిమ విజయం మంచికే కలుగుతుందా?

గురువు : మంచి చెడులు సృష్టి ఆరంభం నుంచి ఉన్నాయి. సృష్టి అంతం వరకు కూడ ఉంటాయి. చూడటానికి కన్నులున్నాయి. చూసిన విషయం నుండి అవగాహన చేసుకొనే మనస్సును బట్టి, చూచిన విషయం ప్రభావం చూపుతుంది. కన్నుల చూచి సంతోషించటం, విని సంతోషించటం మనసుకు చేత కాదు. మనసునకు విచికిత్స, వ్యాఖ్యానము, అభిప్రాయములు, విమర్శలు- ఇత్యాది రోగములు అంటి ఉంటాయి. అట్టి మనసునకు ఈ ప్రపంచమందలి మంచి చెడులే గోచరిస్తాయి. దైవ విలాసం గోచరించదు. మనసు చూచి, విని ఆనందించగలిగే స్థితికి చేరటం కోసమే దానికి శిక్షణ ఇవ్వాలి. అపుడే విలాసం గోచరిస్తుంది. వీలైతే అది నేర్చుకో.

## (70)

శిష్యుడు : గురుదేవా! దైవమును లోపల దర్శించుట ప్రధానమా? బయట దర్శించుట ప్రధానమా?

గురువు : రెండునూ ప్రధానమే. లోపల దర్శించువారు బాహ్యము నశ్రద్ధ చేయుదురు. బాహ్యమును దర్శించువారు అంతరంగము నశ్రద్ధ చేయుదురు. దైవము లోపల ఎంత ఉన్నాడో, బయటకూడ అంతే ఉన్నాడు. అంతః సౌందర్య మెంత ముఖ్యమో, బాహ్య సౌందర్యము కూడ అంతే ముఖ్యము. బాహ్యానంద మెంత ముఖ్యమో, అంతరానందము కూడ అంతే ముఖ్యము. బాహ్యాంతరములు రెండిటి యందు దైవమును దర్శించుట సమగ్ర యోగము.

# 71

శిష్యుడు : గురుదేవా! మీవలె నేనును సన్యసించ దలచితిని. మీరనుమతించినచో నేడే సన్యసింతును.

గురువు : తెలియని వయస్సున నేను సన్యసించితిని. తెలిసిన పిదప, సన్యసింప నవసరము లేదని తెలిసినది. లోపల సన్యసించిన చాలును. బయట సన్యసించ నవసరము లేదు. లోసన్యాస మేర్పడినచో పైపైన ఏర్పడిన సంబంధములు బంధములు కాదు. కీర్తి, ధనము, బంధుత్వము, లోకమున గుర్తింపు, తనను గూర్చిన భావము ఇవి యన్నియు లోపల తెగుట నిజమగు సన్యాసము. వేషము, భాష, కట్టు బొట్టు, ఆచారము ఆశ్రయించి సన్యాసులమని భ్రమపడు వారెందరో గలరు. నిజమగు సన్యాసులు, సన్యాసు లని తెలియకుండగ నుందురు. జనకుడు, రాముడు, కృష్ణుడు, వశిష్ఠుడు ఇత్యాది మహాప్రజ్ఞులు సన్యాస మును అనుక్షణము నిర్వర్తించి చూపిరి. నీవును లోపల సన్యసించుము. బాహ్య సన్యాసము పరిష్కారము కాదు.

(72)

శిష్యుడు : గురుదేవా! నాలో ప్రశాంతత పెరుగుచున్నకొలది నిద్ర తగ్గుచు నున్నది. ప్రశాంతముగ నిద్రించ లేకున్నాను. పరిష్కారము తెలపండి?

గురువు : అలసిన వానికి నిద్ర అవసరము. అలసట లేనివానికి నిద్ర అంత అవసరముండదు. దైనందిన జీవితమున మనసు, ఇంద్రియములు, శరీరము బాగా అలసి పోవుట సామాన్యము. అట్టి వారికి ఆరు, ఏడు గంటల నిద్ర సహజము. నీవు ప్రశాంతముగ దినచర్య నిర్వర్తించునపుడు ఇతరులవలె నిద్రించు అవసరముండదు. కనుక నీవు ప్రశాంతముగ దివ్యానుసంధానమును చెంది, విశ్రాంతిగ నుండ వచ్చును. నీది నిద్రలేమి కాదు. నీకంత నిద్ర అవసరము లేదు. ప్రశాంతచిత్తులు ఒక జాముకన్న నిదురపోరు (జాము అనగా మూడు గంటలు). యోగులు, ఋషులు ఆ సమయమున కూడ సూక్ష్మ లోకము లందు ప్రశాంతముగ పనిచేయుదురు. వారు నీకు ఆదర్శమై యుండవలెను.

## 73

శిష్యుడు : గురుదేవా! మీ శిష్యులలో ఒకడు త్రాగుబోతు, మరొకడు దొంగ, ఇంకొకడు పరస్త్రీ అభిలాషి. వీరందరిని మీరెట్లంగీకరించు చున్నారు?

గురువు : ముందుగ నీకొక విషయము తెలియవలెను. నాకెవ్వరును శిష్యులు లేరు. కాలము, దేశము, కర్మమును బట్టి నా చుట్టును కొందరు చేరినారు. నన్ను సూత్రముగ నేర్పరచుకొని తమని తాము ఉద్ధరించుకొను ప్రయత్నమున యున్నారు.

వీరందరియందు ఆపేక్ష, ఉపేక్ష కలిగి యున్నాను. అంగీకారము గాని, అనంగీకారముగాని నావద్ద లేవు. నీవు చూచిన త్రాగుబోతుయందు సత్యభాషణము కూడ యున్నది. దొంగయందు శ్రద్ధ కూడ యున్నది. కామాతురుని యందు పనులయందు నేర్పు యున్నది. అందరియందు కొన్ని శుభ వాసనలు, కొన్ని అశుభ వాసనలు ఉండును. నా దృష్టి వారి

యందలి పరమాత్మ యందున్నది. వారి శుభాశుభ లక్షణములు వారే గుర్తించి మార్చుకొనుటకు ఈ ఆశ్రమమున వీలున్నది. అన్నిటికి మించి వారందరి యందు దైవమున్నాడు. అతనిని వీక్షించుచు వీరందరిని ఉపేక్షించుచు యున్నాను.

## 74

*శిష్యుడు* : గురుదేవా! గత పుష్కరకాలంగా మీతో ఉన్నాను. మీరు ఎప్పుడూ నవ్వుతూ ఉంటారు. ఎవరేమడిగిన నవ్వుతూ చిటికెడు విభూతి చేతిలో వేస్తారు. ఎన్నడు ఏ బోధ చేయలేదు. మీరిపుడు దేహం విసర్జించే సన్నివేశములో ఉన్నారు. ఇప్పుడూ నవ్వుతూనే యున్నారు. మీరు వెళ్లిపోయే ముందు కనీసం ఈ నవ్వులోని అంతరార్థం తెలపండి?

*గురువు* : గురువుగారు నవ్వుతూ ఇలా చెప్పారు. **"ఏముందిరా! నా నవ్వు కర్థం? ఈ ప్రపంచం వెఱ్ఱిది. ఇది సత్యం అనుకుంటే మనం వెఱ్ఱివాళ్ల మవుతాం. వెఱ్ఱి ప్రపంచంలో వెఱ్ఱి మనుషులు వెయ్యి రకాలుగా ప్రవర్తిస్తూ ఉంటారు. ఇదంతా ఒక కామిడీ సినిమా. ఉదయం కామిడీలో ప్రవేశిస్తాం. రాత్రి కామిడీలోంచి నిష్క్రమిస్తాం. నవ్వుకోవటానికే ఈ ప్రపంచం**

సృష్టించారని భావిస్తాను. అందుకే నవ్వుతూ వెళ్ళి పోతున్నాను. చేతనైతే నువ్వూ నవ్వు. లేకపోతే వెట్టివాడిగా ఉండిపో. వస్తా!" అంటూ గురువు దేహం విడిచి వెళ్ళిపోయారు.

75

శిష్యుడు : గురుదేవా! ప్రపంచం మరీ విపరీతమైన పోకడలను చూపిస్తోంది. అంతకంతకి వెఱ్ఱితలలు వేస్తోంది. ఈ మార్పును చూస్తూ ఉంటే ఎటుపోతున్నామో తెలియటం లేదనిపిస్తోంది.

గురువు : మారేదే ప్రపంచం. అది ఇలా మారుతుంది, అలా మారుతుందని ఊహించడం ఒక వెఱ్ఱి. మారే ప్రపంచంలో మారని వానిగ అంటే నీలోపల స్థిరంగా నీవుంటే మార్పులను దర్శిస్తూ ఉండవచ్చు. మార్పులో నీవు చేరితే కొట్టుకొని పోతావు.

మార్పులు నీ బయటే గాదు, నీ లోపల కూడ జరుగుతూ ఉంటాయి. దానిని గుర్తించడమే మన పని. ఎప్పుడూ గుర్తించేవాడు స్థిరమై ఉంటాడు. ఎటూ పోడు. తాను తానుగానే ఉంటాడు.

# 76

శిష్యుడు : గురుదేవా! మనం ఏదో ఒక ప్రదేశంలో స్థిరంగా ఉండవచ్చు కదా! ఈ నిత్య సంచారం దేనికి?

గురువు : జీవితం ఒక ప్రయాణం. జీవనమొక ప్రవాహం. ప్రయాణం, ప్రవాహం గమ్యానికి చేరుస్తాయి. ప్రవాహంలో ఎవరైనా ఇల్లు కట్టుకొని స్థిరపడతారా? ప్రయాణములో ఎవరైనా ఆశ్రమాల పేరన చతికల పడతారా? సాగే ప్రయాణంలో సాగిపోదాం. ఆగిపోయే ఆలోచనలు వద్దు. సంచారం దేహానికే గాని, జీవునికి కాదు. దేహమనే రథంలో కూర్చొని ప్రయాణం చేయటం ఎందుకు అనే ప్రశ్న అవివేకం. సాగే ప్రయాణాన్ని సాగనీ. ప్రయాణీకుడిగ, స్థిరముగ కూర్చుండుము.

## 77

శిష్యుడు : గురుదేవా! ఆలోచించినకొలది నిర్ణయం జటిల మవుతుంది. ఆలోచించక నిర్ణయం చేయలేము కదా? పరిష్కారమేమిటి?

గురువు : పరిష్కారము ఏమీ లేదు. నిర్ణయం జరిగిపోతుంది. ఆలోచనల దారి ఆలోచనలది. నిర్ణయం దారి నిర్ణయానిది. రెండునూ కలియ నక్కర లేదు.

నీబోటి ఆలోచనాపరుడు సరుకులమ్మటానికి పై ఊరెళ్ళాడు. సరుకులు వెంటనే అమ్ముడు పోయాయి. ఆనందంతో ఇంటికి టెలిగ్రాం ఇచ్చాడు. "సరుకులు లాభానికి అమ్ముడు పోయినాయి. రేపటికే ఇల్లు చేరుకుంటా... ప్రేమతో" తీరా టెలిగ్రామునకు రుసుము చెల్లించేటపుడు ఆలోచన వచ్చింది. సరుకులు లాభానికే కదా అమ్ముతాం. ఆ మాట ఎందుకు చెప్పటం అనుకున్నాడు. పని అయిపోయిన తరువాత ఇంటికే వెళతాం కదా! ఆ మాటెందుకు

చెప్పటం. "ప్రేమతో" అని వ్రాయలా. తన భార్యకు తెలుసు కదా తన ప్రేమ. ఇలా భావించి టెలిగ్రాం చింపేశాడు. నిర్ణయం జరిగిపోయింది. అతిగా ఆలోచిస్తే అలాగే ఉంటుంది బ్రతుకు.

(78)

శిష్యుడు : గురుదేవా! ఎన్నో దివ్య విషయములను మీ నుండి వింటూ ఉంటాం. చాల విషయాలు ఆచరించా లనిపిస్తుంటుంది. ఎక్కడ మొదలుపెట్టమంటారు?

గురువు : నీకు బాగా నచ్చినది, సులభంగా ఆచరించ గలిగేది ఎన్నుకో. ఆచరించలేనిది, నచ్చనిది ఎంత గొప్పదైనా ప్రస్తుతానికి నీకు అనవసరం.

ఒక ఉదాహరణ : క్లాసులో టీచరు పిల్లలకు పాఠాలు చెపుతూ, భూమి గుండ్రంగా ఉంటుందని అరగంట సేపు ప్రసంగించారు. అటుపైన ఒక పిల్లవాడిని భూమి ఎలా ఉంటుంది అని ప్రశ్నించాడు. వాడు మాట్లాడలేదు. ప్రోత్సహించడానికి చదునుగా ఉంటుందా, గుండ్రంగా ఉంటుందా అని అడిగాడు. వాడు మాట్లాడలేదు. సమాధానం చెప్పవేమి అని ప్రశ్నించాడు. పిల్లవాడు “నాకు తెలిసినంతంలో భూమి ఎగుడు దిగుడుగా ఉంటుంది. మా యింటి

నుంచి ఈ స్కూలుకి నడిచివచ్చేటపుడు నేను రోజూ చూస్తున్నాను. మీరు చెప్పినట్లుగ గుండ్రంగా ఎప్పుడూ కనిపించలేదు." ఆ కుర్రవాడే పెరిగి పెద్దయినాక మహా జ్ఞాని అయ్యాడు. నీవు ఆ పిల్ల వాడిలా ఉండటం నేర్చుకో. అపుడు నా అంత అవుతావు.

## 79

మరణశయ్యపై నున్న జ్ఞానియగు భర్తను చూచి, భార్య ఇలా అడిగింది : "మీరు మరణించిన తరువాత నేను బొట్టు పెట్టుకోవచ్చా? బంగారు గాజులు, నగలు ధరించవచ్చా?''

జ్ఞాని నవ్వుతూ ఇలా అన్నాడు. : **"నేను మరణించను. ఎప్పుడూ ఉంటాను. శరీరం వదలినా ఉంటాను. బొట్టు, గాజులు, నగలు ధరించడం, ధరించక పోవటం నీ యిష్టం. నీకెలా అనిపిస్తే అలా చేయి."**

చుట్టూ ఉన్న బంధుమిత్రులు విస్తుపోయి **"మరణంలో కూడ ఈయన జ్ఞానియే! ధీరుడే!"** అని గుస గుస లాడారు.

## (80)

శిష్యుడు : గురుదేవా! భూలోకమునందు అత్యుత్తమము, అతి ప్రాచీనము అగు సద్గ్రంథ మేది? అది ఎచ్చట నిక్షిప్తమై యున్నది?

గురువు : ఏ ప్రాంతమునకా ప్రాంతము వారు తమ ప్రాచీన గ్రంథములే ఉత్తమమని, సత్యమని భావించుచు, ఇతరములన్నియు సత్యదూరములని వివాదములు సలుపుచు నుందురు. ఇందు ఏ ఒక్కరును, తమ తమ గ్రంథములను భక్తి శ్రద్ధలతో, శోధనాదృష్టితో పరిశీలించరు. ఒకవేళ అట్లు పరిశీలించినను, ప్రాచీనులు వాడిన భాష, సంకేతములు పూర్ణముగ అర్థము కాక, మిడిమిడి జ్ఞానమును కలిగించుచు అయోమయ స్థితిలో పడియుండి, తామెరిగినదే సత్యమను భ్రాంతిలో చిక్కుకొని యుందురు. నిజమునకు అత్యుత్తమము, అతి ప్రాచీనము అగు సత్యము నీయందే యున్నది. నీ యందు నీవలె

యున్నది. నీలోనికి చొచ్చి శోధించినచో నీకు సత్యము దర్శనమగును. అదియే ఉత్తమము, ప్రాచీనము కూడ. నీవొక ఉద్గ్రంథము అయి ఉన్నావు. నీ గ్రంథమును నీవే చదువుట నేర్చుము. నీ స్వరూపమును నీలోన శోధించి దర్శింపుము. తపస్విజనులిట్లే సత్యమును దర్శించిరి.

## 81

శిష్యుడు : గురుదేవా! మీరు పొందిన జ్ఞానమును, అవగాహనను గ్రంథస్థము చేసినచో బాగుండును.

గురువు : ఇప్పటికే చాల జ్ఞానము గ్రంథస్థమై యున్నది.

శిష్యుడు : కాని మీ నుండి వచ్చు జ్ఞానము నిత్యనూతనముగ ప్రకాశించుచు, అందరికిని ఆనందానుభూతిని కలిగించు చున్నది.

గురువు : జ్ఞానము వెలువడినపుడెల్ల నిత్యనూతనముగ నుండును. మరుసటిరోజు నూతనత్వమును గోల్పోవును. మరికొన్ని రోజులకు పాతబడును. నిత్య నూతనమగు జ్ఞానము నీయందే శోధించి దర్శించుట నిత్యము జరుగవలెను. ఏ ఉదయము వికసించిన పుష్పము అందలి సుగంధములను ఆ రోజునకే పంచును. కనుక నిత్యనూతనానుభూతి, ఆనందము పుస్తకములలో వెతుకక, నీయందు దర్శించు యత్నము చేయుము.

(82)

శిష్యుడు : గురుదేవా! మీ అనుయాయులలో సిద్ధి పొందిన వారెవరైనా కలరా?

గురువు : అనుయాయులలో సిద్ధి పొందువారు చాల తక్కువ. వారు కేవలము నన్ను అనుకరింతురు, నన్ను అనుసరింతురు. ఇట్టివారు తమని తామెరుగరు. నిత్యము తమని తామెరుగు ప్రయత్నము సాగుచు నుండ వలెను. తన లోపలి సత్యమును తానెరుగ వలెను. దర్శింపవలెను.

బాహ్యమున నన్నుసరింతురేగాని, నేను నాలోనికి చనునపుడు నన్నుసరించలేరు గదా! అపుడు వారేమి చేయవలెను? వారును వారి లోనికేగుటకు ప్రయత్నింపవలెను. తమలోనికి తాము చను విధానము అనుయాయులకు వివరించి, నాలోనికి నేను నిత్యము ఏగుచు నుందును. వారును విధానము ననుసరించి, వారిలోనికి వారేగవలెను. అట్లేగినచో

వారు సత్యమును బడసి, సిద్ధులగుదురు. సిద్ధుడైన వాడు తనను తానే అనుసరించును. కనుక నా చుట్టును అనుయాయులే ఉందురు. సిద్ధులుండరు. సిద్ధులు తమయందలి సత్యము ననుసరించుచు వర్తింతురు.

## 83

శిష్యుడు : గురుదేవా! సత్యమార్గమున పయనించుటకు నమ్మక మవసరమా?

గురువు : అవసరము లేదు. వలసినది నమ్మకము కాదు. శోధనము. పరిశోధనము. అంతరంగ అన్వేషణము. తనను తాను శోధించుకొనుచు మూలమున కేగుటకు వలసినది జిజ్ఞాసయేగాని నమ్మకము కాదు. నీ జిజ్ఞాసనుబట్టి నీకు తెలియుట, అనుభూతి పొందుట యుండును.

## (84)

శిష్యుడు : గురుదేవా! జమీందారుగారు మీవద్దకు వచ్చి, ఉపదేశమును పొంది విరివిగ కానుక లిచ్చినారు. మీరు కానుక లన్నింటిని ప్రేమపూర్వకముగ నిరాకరించి, ఒక కదళీఫలము మాత్రము స్వీకరించి నారు. మీరు ఎవరివద్దను కానుకలు స్వీకరించ కుండుటకు ప్రత్యేక కారణమేమైన ఉన్నదా?

గురువు : గురువుగారు తాను స్వీకరించిన కదళీఫలమును శిష్యుని చేతిలో పెడుతూ ఇట్లనిరి :

"ఈ ఫలము నీ ఆకలిని తీర్చును. నేనెవ్వరి వద్దను కానుకలు స్వీకరించకుండుటకు కారణ మొక్కటియే. నేను అమిత సంపన్నుడను. భూమిపై అత్యంత సంపద కలిగినవాడుకూడ నన్ను సరిపోలడు. భూమి సంపద అంతయు కూడ నా సంపదతో సరితూగదు. నేను వసించు లోకము నందలి సంపద ఈ భూసంపద కన్నను గొప్పది. సత్య మెరిగిన వానికి

సంపద విలువ తెలిసినట్లుగ ఇతరులకు తెలియదు. అమిత సంపన్నునకు కానుకలు యిచ్చి ఏమి ఫలము? ఈ లోకమున మీరు నా కందించు సంపదల కన్న నేను మీకందించు సంపద అత్యంత గంభీరము. ఈ సంపదలు, కీర్తి నాకు నిరుప యోగము.

## 85

శిష్యుడు : గురుదేవా! చాల సంవత్సరములనుండి మిమ్ములను గమనించుచున్నాను. మీరు సంపదపైగాని, మనుష్యులపైగాని, మరి ఏ ఇతర విషయములపైగాని ఆధారపడరు. మీ శరీరము కూడ కృశించి ఎముకలు కన్పట్టుచున్నవి. మీ బలమేమి?

గురువు : నా బలమల్లా నా యందలి ధ్వజస్తంభమే. అదియే ఆధారము. అందలి ప్రాణము, చైతన్యము వర్తింప చేయు విలాసమును దర్శించుచు, ఇతర ఆధారములు క్రమముగ విసర్జించితిని. నా యందలి ఆ ధ్వజస్తంభమే నా ఆవాసము. అందుకూడ నేనుండునది శిఖరము మీదనే. మిముబోంట్లు పిలచినపుడెల్ల స్తంభము దిగి, హృదయము నుండి ప్రతిస్పందించి, మరల స్తంభ మూలమునకు చేరుదును. నా యీ స్తంభమునకు పునాది ఊర్ధ్వమున నున్నది.

నీవును నీలోనికి ప్రవేశించి, ఊర్ధ్వమును చేరినచో శాశ్వత సహచర్య ముండగలదు. లేనిచో ఈ జన్మతో నీకు నాకు గల అనుబంధము సమాప్తమగును.

## (86)

శిష్యుడు : గురుదేవా! సద్గురువంటే ఎవరు?

గురువు : 1. సద్గురువంటే నీ యందలి రూపాతీతమైన తత్త్వాన్ని నీకావిష్కరించేవాడు.

2. నీ మనసునకు నిలకడ కల్పించేవాడు.

3. నీ అవగాహనకు మించినవాడు.

4. నీ యందు నీవలె గోచరించువాడు.

5. తాను గురువునని మనసా, వాచా, కర్మణ ప్రకటించని వాడు.

6. తనయందు తానుండు వాడు.

7. ఎవరినీ నమ్మించు ప్రయత్నము చేయనివాడు.

8. స్వాలంబనమే కాని, ఇతర ఆలంబనములు కోరనివాడు.

9. తన ఉనికి వలన ఎట్టి భంగము ఎవ్వరికిని కల్పించనివాడు.

87

శిష్యుడు : గురుదేవా! సద్గురువులచెంత శిష్యబృందము లేర్పడుచు నుండును. బృందమునందు శిష్యుల సంఖ్య పెరుగుచు నుండును. మీరేల ఎవ్వరినీ చేర నివ్వరు? ఏల ఒంటరిగ నుందురు?

గురువు : గురుత్వమొక ఆకర్షణ. బృందములకు గురువు ఒక వినోద వస్తువు. వినోదమునకై నాటకములు, సినిమాలు చూచినట్లే గురువు చెంతచేరి వినోదింతురు. వారి వినోదమునకై గురువు చుట్టును చేరుచు నుందురు. విదూషకులు కూడ వినోదము ఇచ్చుచు నుందురు. ఒక సద్గురువు కేవలము వినోదకుడు కాదు గదా! ఆచరణమున ఆసక్తి గలవానికి దారి చూపువాడు సద్గురువు. బృందములతో వినోదించువాడు విదూషకుడే అగును.

(88)

శిష్యుడు : గురుదేవా! పేరు ప్రతిష్ఠలు గూర్చి ఎందరో గురువులు సతమత మగుచున్నారు. దీనిపై మీ అవగాహన సెలవివ్వండి?

గురువు : అంతర్యామి యందు ప్రతిష్ఠింపబడి తన పేరు తాను మరచినవాడు సత్పురుషుడు. అతడు సుప్రతిష్ఠుడే. ఇతర ప్రతిష్ఠలు తనకి సాటిరావు. తన పేరు తనకు గుర్తున్నపుడు తాను సుప్రతిష్ఠుడు కాడు. సర్వవ్యాపి యగు దైవముతో కూడి, తనను తాను మరచిన వాడు పేరు ప్రతిష్ఠలకై ప్రాకులాడడు.

ఇప్పటి కెన్నియో సృష్టులు ఏర్పడి, వృద్ధి చెంది సర్వ వ్యాపియందు లయమైనాయి. ఆ సృష్టికర్తల పేర్లే నిలువ లేదు. ఇక ఇతర జీవుల మాటేల? పేరు ప్రతిష్ఠలు వ్యామోహమే గాని, అందు సత్యము లేదు.

## 89

శిష్యుడు : గురుదేవా! దైవం ప్రతిస్పందించడానికి ఏ విధానం అవలంబించాలి? చెట్టును పుట్టను నమ్మినవారు, రాయి రప్పను నమ్మినవారు, పర్వతములను నదులను నమ్మినవారు, పాములను పక్షులను నమ్మినవారు, అగ్నిని సూర్యుని నమ్మినవారు- ఇట్లు మానవులలో అనేకరకములుగా దైవం నుండి సమాధానం పొందినవారు మానవ చరిత్రలో గోచరిస్తారు. ఇందు ఏ విధానము మీ దృష్టిలో ప్రధానం?

గురువు : విధానమేదైనా, ప్రార్థన యందు త్రికరణశుద్ధి ప్రధానము. త్రికరణశుద్ధిగ ప్రార్థించడం చేత నీలో నుండే నీకు సమాధానం వినిపిస్తుంది. అంతరాత్మ లోనుండి నీ ప్రార్థనకు ప్రతిస్పందిస్తాడు. బాహ్యంగా ప్రార్థనకు నీవు ఏ వస్తువు పెట్టుకున్నా, సమాధానం అంతరాత్మ నుండే వస్తుంది. చెట్టు, పుట్ట, గోడ, పాము, పక్షి, పర్వతం సమాధానం చెప్పవు. నీలో

నుండి నీకు వినిపించేది, బాహ్యం నుండి ప్రసరిం చటం లేదు. కాని నమ్మకంచేత అట్లా భావిస్తావు. ఏ వస్తువు నుద్దేశించి ప్రార్థించినా త్రికరణశుద్ధి ఉండాలి. తపన ఉండాలి. ఆర్తి ఉండాలి. ఆర్ద్రత ఉండాలి. ఇవి ప్రధానం.

# 90

శిష్యుడు : గురుదేవా! మీరు అనేకానేక విషయాలు బోధిస్తూ ఉంటారు. మీరు గ్రంథ రచన ఎందుకు చేయరు?

గురువు : మీకు వార్తాపత్రిక చదివితే బాగుంటుందా? లేక రేడియోలో వార్తలు వింటే బాగుంటుందా? లేక టి.వి. చూస్తూ వార్తలు వింటే బాగుంటుందా?

శిష్యుడు : టి.వి. చూస్తూ వింటేనే బాగుంటుంది.

గురువు : నువ్వన్నది సత్యం. టి.వి.లో వార్త చెప్పేవాడు కనబడ తాడు. వార్త వినేవాడు ఎదురుగుండా వింటాడు. అచ్చట దృశ్యం, శ్రవణం ఉంటుంది. కాబట్టి ఎక్కువ బాగుంటుంది.

రేడియోలో దృశ్యం ఉండదు. శ్రవణం ఉంటుంది. అందుకనే టి.వి. కన్న తక్కువ బాగుంటుంది.

వార్తా పత్రికలో శ్రవణం కూడ ఉండదు. దృశ్య మెలాగూ ఉండదు. కనుక అన్నిటికన్న తక్కువ బాగుంటుంది.

నేను ప్రవచనం చేస్తూ ఉంటే, నన్ను చూడవచ్చు. నన్ను వినవచ్చు. నానుండి వచ్చే ధ్వని ప్రభావాన్ని ఆస్వాదించవచ్చు. నేను వ్రాయటం మొదలుపెడితే జనబాహుళ్యాన్ని ఉద్దేశించి వ్రాస్తానుగాని, మిమ్ము లను (సాధకులను) ఉద్దేశించి వ్రాయుటకు వీలు పడదు. చదువుకొనే వారికి కూడ నా దృశ్యం, నా నుండి వచ్చే నాదస్వరం రెండూ ఉండవు. ఇక్కడ కూర్చొని మీరు విన్నపుడు మీకు కలిగే అనుభూతి పరోక్షంగా నా రచనలు చదివే వారికి కలగటం తరచు జరుగదు. కనుక ప్రత్యక్ష ప్రవచనానికే నేను విలువనిస్తా. పరోక్ష శ్రవణం, పరోక్ష పఠనం నందు శ్రమ ఎక్కువ, అనుభూతి తక్కువ.

కృష్ణుని భగవద్గీత అర్జునునకు ప్రత్యక్షానుభూతి. సంజయునికి, ధృతరాష్ట్రునకు పరోక్ష అనుభూతి. ధృతరాష్ట్రునికి గీతాసారం దక్కలేదు. సంజయునికి వ్యాసానుగ్రహంగా దూరదర్శనం లభించింది గనుక కొంత పండింది. పూర్ణానుభూతికి ప్రత్యక్ష దర్శనం, శ్రవణం అత్యుత్తమ సాధనం అని నా మతం.

## 91

శిష్యుడు : గురుదేవా! మీ ఆత్మకథ ఒక పుస్తకంగా వస్తే బాగుంటుంది.

గురువు : ఆత్మకు కథ ఉండదు. కనుక ఆత్మకథ అనునది ఒక మాయ. ఆత్మ నాశ్రయించివున్న స్వభావానికి కథ ఉంటుంది. అది ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. తానెవరో తెలిసినవారికి తనను గూర్చిన ఆసక్తే ఉండదు. అందువలన ఆత్మకథవలే చలామణి అయేవన్నీ కూడ అహంకార కథలే.

అవతారపురుషులు గాని, మహాత్ములుగాని తమను గూర్చి తాము చెప్పుకొనలేదు. వ్రాయలేదు. అదే నాకు ప్రమాణం. కృష్ణుని గూర్చిగాని, బుద్ధుని గూర్చి గాని, ఏసును గూర్చిగాని ఇతరులు వ్రాసినవే కథలుగా ఉంటాయిగాని, తమను గూర్చి తాము వ్రాసుకున్న వారి కథలు అహంకార కథలే.

# 92

శిష్యుడు : గురుదేవా! ఆత్మకథలు సత్యం కాదంటారా?

గురువు : ఆత్మ తురీయస్థితికి చేరిన ఎఱుక. జీవనము జాగ్రదవస్థ నున్నను అది కూడ ఒక స్వప్నమే. స్వప్న కథలలో సత్యం శాశ్వత సత్యం కాదు. ఆత్మజ్ఞానం కలిగిన వారికి కలనుండి మెలకువ వచ్చినట్లుగ, అంతవరకు జరిగిన కథ, కలవలె ఉంటుంది. ఇందువల్ల తన కాత్మజ్ఞానం కలిగిందని ఎవ్వరూ స్పష్టంగా చెప్పలేరు. దేనివలన ఆత్మజ్ఞానం కలుగుతుందనే ప్రశ్న ఎప్పటికీ మిగిలిపోతుంది. స్వప్నం నుంచి మేల్కొంచిన వానికి ప్రాతిపదిక స్వప్నంలో ఉండదు. కనుక ఆత్మ కథలన్నీ స్వప్న కథల లాంటివే. ఎవరి స్వప్నం వారిదే. ఎవరి మెలకువ వారిదే. నా స్వప్నంనుంచి నాకు మెలకువ కలిగింది. నీ స్వప్నం నుండి నీవెపుడు మేల్కొంచుతావో ఎవరికెరుక! స్వప్నకథలు నిజానికి ఆత్మకథలు కావు. ఇది నా మతం. అంటే నా అవగాహన.

## 93

శిష్యుడు : గురుదేవా! దక్షిణామూర్తి మౌన వ్యాఖ్య చేస్తారట, మహర్షులు మౌనంగా వింటారట. ప్రపంచంలో అనేక మంది గురువులు ప్రవచనాలు చేస్తూ ఉంటారు. మీరు కూడ చేస్తూ ఉంటారు. దక్షిణామూర్తి గురువు లందరికీ గురువు కదా! ఆయనను అనుసరిస్తూ మీరు కూడ మౌన వ్యాఖ్యలు చేయవచ్చు గదా!

గురువు : మహర్షులు మౌన వ్యాఖ్యను వినగలరు. సామాన్య మానవులు వ్యాఖ్య చేసినను వినరు. అందువలన ఈ లోకంలో మౌన వ్యాఖ్యలు కుదరవు. గోతిలో పడే గ్రుడ్డివాడికి హెచ్చరికలు గట్టిగా చెయ్యాలి. అవసరమైతే మైకులు పెట్టి కూడ చెయ్యాలి. మానవులు గోతిలో పడకుండా ఉండడానికే గురువుల ప్రవచ నాలు. వారు కొండెక్కటం తరువాతి మాట. గోతిలో పడకుండా ఉంటే అంతే చాలు. లోకంలో గ్రుడ్డి, చెముడు, కుంటి, అవిటివారే ఎక్కువ. వారు ఆపదల పాలుకాకుండ ఉండడానికే వచనాలు, ప్రవచనాలు.

## 94

శిష్యుడు : గురుదేవా! మీరు ధ్యానమందు ఏ ఏ వేళలలో ఉంటారు?

గురువు : ప్రస్తుతము ఉండటమే ఉంది. ధ్యానమంటూ ఏమీ లేదు. ఇది వరకు ధ్యానముండేది. ధ్యాస ఉండేది. ఇపుడు కేవలం ఉండటమే ఉంది. ఈ ఉండటం అంటే ఏమిటో కూడ భాషలో చెప్పడానికి వీలు పడదు. ఎన్నో సాధనాపరమైన విషయములు ఆచరించి, విసర్జించాను కూడ. జీవుడు తన్ను తాను చేరుకొనే మార్గంలో అనేక మైలురాళ్ళు చేరి, వాటిని వదలి ముందుకు సాగుతాడు. అందులో చివరి మైలురాయి ధ్యానం. ధ్యేయమే తానైన వాడికి, ధ్యాన మక్కరలేదు. కాలాన్ని, దేశాన్ని బట్టి ఉంటూ ఉండటం ఉంటుంది. ఒకప్పుడు విలువలు అను కొన్నవి ఇప్పుడు విలువ లనిపించవు. గతమంతా కుఱ్ఱతనంగా అనిపిస్తుంది. నా యీ స్థితి నెమ్మది మీద, క్రమంగా నీవు తెలియగలవు.

## 95

శిష్యుడు : గురుదేవా! అహంకారికి మృత్యువు తప్పదా?

గురువు : దేవుడు జీవుడగుటయే అహంకార స్థితి. త్రిగుణ ముల నుండి తత్త్వము వ్యక్తిగ భాసిస్తుంది. ఈ వ్యక్తిత్వమే అహంకారము. దానికి మూడు స్థితు లున్నాయి. తామసిక అహంకారము, రాజసిక అహంకారము, సాత్విక అహంకారము. ఇందు రజః తమస్సులతో కూడిన వానికి మరణానుభవ ముంటుంది. సత్వము నందున్న వారికి అమృతత్వ స్థితికి అవకాశముంది.

నిజానికి సాత్వికుడు కూడ అహంకారియే. కాని బుద్ధి నిర్మలత ఉంటుంది గనుక, నిర్మల జ్ఞానాన్ని పొంద వచ్చు. దైవమే తానుగ నున్నాడు అని తెలియుట నిర్మల జ్ఞానము. సముద్రమే అలగా ఉంది. సముద్రానికి ఉన్న శాశ్వత స్థితి అలకు లేదు. దైవము సముద్రము వంటివాడు. తాను అలవంటివాడు అని

నిత్యం గుర్తుండే సాత్వికునకు మరణానుభవ ముండదు. స్థితి మార్పు ఉంటుంది గాని తాను శాశ్వతుడే అని తెలిసి ఉంటాడు. రాజసికులకు, తామసికులకు దైవమే తానుగా నున్నాడన్న నిర్మల జ్ఞానం లేకపోవుట వలన మరణావస్థ, జననావస్థ తప్పవు.

# 96

శిష్యుడు : గురుదేవా! మానవులకు, మహాత్ములకు భేదమేమి?

గురువు : ఇహపరములు తెలిసినవారు మహాత్ములు. ఇహము మాత్రమే తెలిసినవారు మానవులు. ఇహలోకంలో ఎంత తెలిసినా అది పరిమిత జ్ఞానమే. తానెక్కడ నుంచి వచ్చాడో తెలియదు. ఎందుకు వచ్చాడో తెలియదు. మరణానంతరం ఎటుపోతాడో తెలియదు. బ్రతికున్నంతకాలం ఈ లోకంలో చేసిన పనులే చేసుకుంటూ, చక్రభ్రమణంలో అనంతకాలం ఉంటాడు.

మహాత్ములు తాము ఎందుకు వచ్చారో తెలుసు కుంటారు. ఏమి చేయాలో తెలుసుకుంటారు. ఇటుపై ఎటువెళతారో తెలిసి ఉంటారు. అంతేకాదు. ఇక్కడ ఉంటూనే ఇతర లోకాలలోనికి కూడ వ్యాపిస్తూ ఉంటారు. వారికి లోక పరిమితు లుండవు. వారి

జ్ఞానము, వారి వర్తనము ఒకే లోకానికి పరిమితమై యుండదు.

మానవులకు, మహాత్ములకు హస్తిమసికాంతరము అంత తేడా ఉంది.

(97)

శిష్యుడు : గురుదేవా! పురుషుడే భూతము, వర్తమానము, భవిష్యత్తు అని వేదం చెపుతోంది, అదెలా?

గురువు : నీవు ఒక వృక్షాన్ని చూశావనుకో. నీకు వృక్షమే కనిపిస్తుంది. వేద మెరిగిన వారికి ఆ వృక్షము పూర్వాపరాలు కూడ కనిపిస్తాయి. వృక్షమునకు మూలము విత్తనము. విత్తనమే వృక్షమైనది. కనుక విత్తనము భూతము (జరిగిపోయిన కాలము). వృక్షము ప్రస్తుతము అంటే వర్తమానకాలం. కొన్నాళ్ళకు ఈ వృక్షము మరల విత్తన మవుతుంది. అది భవిష్యత్. ఒక వేదఋషి వృక్షాన్ని దర్శించినపుడు బీజ స్థితిని, వృక్ష స్థితిని, మరల బీజ స్థితిని చేరుకున్నది ఒక్కటే. అదే ఇన్ని రూపాలుగ మార్పు చెందుతున్నది అని దర్శిస్తాడు.

పై విధంగానే పురుషుడే సృష్టిగ ఏర్పడి, సృష్టిలో వసించి, మరల సృష్టి అంతములో తానే ఉంటాడు. శాశ్వతంగా

తానే ఉంటాడు. పూర్వమున్నది, ప్రస్తుత మందున్నది, భవిష్యత్ నందున్నది పురుషుడే అనేది వేద దర్శనం.

ఈ గృహమును నిర్మాణం చేయక ముందు ఇక్కడ చోటే ఉన్నది. గృహమందు కూడ చోటే యున్నది. కొన్నాళ్ళకీ గృహ ముండదు. అప్పుడు కూడ చోటే ఉంటుంది. చోటెప్పుడూ చోటుగానే ఉంటుంది. అందనేక స్థితిగతు లేర్పడుతూ, వృద్ధిచెంది, తిరోగ మించి మరల చోటులోనే కలుస్తాయి. ఎల్లకాల మందు ఉండేది చోటే. ఎల్లకాల మందుండేది పురుషుడే. అతడు శాశ్వతుడు. అత డేమార్పుకు గురికాడు. అతని యందు మార్పులు జరుగు తుంటాయి. మూడు కాలములయందు జరిగే మార్పులకు మూలమై, శాశ్వతమై, ఈశ్వరుడై ఉంటాడు. నీవు కూడ అట్టి వాడివే. నీ శాశ్వత తత్త్వము, అమృతత్వము, ఈశ్వరత్వము నీవు తెలుసుకోవటానికే ఈ వేదసూక్తం.

# 98

శిష్యుడు : గురుదేవా! ఈ ఆధునిక యుగంలో పాశ్చాత్యులు తూర్పుదేశం వారికన్నా చాల పురోగతి సాధించా రనిపిస్తుంది, మీరేమంటారు?

గురువు : పాశ్చాత్యులైనా, ప్రాగ్దేశముల వారైనా చక్రగతిలోనే యున్నారుగాని పురోగతి చెందుచున్నవారు అత్యంత అల్ప సంఖ్యాకులే. ఎవరూ భూమండలాన్ని దాటి ఇతర మండలాలలోనికి వ్యాపించటం లేదు. స్థూల లోకంలోనే తీరుబడి లేకుండా తిరుగుతున్నారు. చంద్రుడు దగ్గరికి వెళ్ళినా, కుజుడు దగ్గరకు వెళ్ళినా, స్థూల శరీరంతో స్థూల యంత్రాలతోనే వెళ్ళి వస్తూ ఉన్నారు. అందరూ స్థూలంగానే ఉండిపోయారు.

స్థూలం నుండి సూక్ష్మంలోనికి ప్రవేశించిన వారు పురోగతి చెందినవారు. కేవలం స్థూలంలోనే తిరిగేవారు చక్రగతిలోనే ఉన్నారు. సూక్ష్మము, దివ్య మైన లోకాలలోనికి ప్రవేశించగలగటం, భూత

భవిష్యత్తుల లోనికి గమనం చేయటం నిజమైన పురోగతి. నిజానికి ఊర్ధ్వగతే పురోగతి. దాని గురించి ప్రయత్నం చేసేవారు భూమిమీద అన్ని దిక్కులలోను ఉన్నారు. కాని వారి సంఖ్య అత్యల్పం.

## (99)

శిష్యుడు : గురుదేవా! శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, మైత్రేయుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు వంటి దివ్య పురుషులందరు రాజవంశములలోనే జన్మించారు. దివ్యత్వానికి రాజవంశం చేరువలో ఉంటుందా?

గురువు : దివ్యత్వానికి కులము లేదు. మతము లేదు. జాతి కూడ లేదు. జాతి, మత, కులముల కతీతమైనది దివ్యత్వం. దివ్యమైన పర్వతా లున్నాయి. వృక్షము లున్నాయి. నదులు ఉన్నాయి. జంతువులు ఉన్నాయి. లోహములు కూడ ఉన్నాయి. కాలమును బట్టి, దేశమునుబట్టి, పాత్రతనుబట్టి దివ్యత్వ మావరిస్తూ ఉంటుంది. కనుక దివ్యత్వానికి చేరువలో ఉండు పాత్రలు పరిశుద్ధమై ఉండాలి. ఎచ్చట పరిశుద్ధత ఉంటుందో అక్కడ దివ్యత్వం అవతరించే అవకాశం ఎక్కువ.

దేవకీ వసుదేవులు అత్యంత పవిత్రమూర్తులు. అలాగే రాముడు పుట్టిన ఇక్ష్వాకు వంశము అమిత పవిత్ర

మైన వంశం. మైత్రేయ మహర్షి తండ్రి దివోదాసు అత్యంత పవిత్రమూర్తి. అట్లే గౌతమబుద్ధుని తల్లి, ఏసుక్రీస్తు తల్లిదండ్రులు దివ్యత్వం అవతరించ డానికి అనువైన వాహికలు. కాలమును బట్టి, దేశమును బట్టి లోకశ్రేయస్సు నుద్దేశించి దివ్యత్వం తన వాహికలను తానే ఎన్నుకుంటుంది. ఇది సత్యం.

భ్రష్టు పట్టిన అనేక రాజవంశా లున్నాయి. భోగము లకు, కామమునకు బానిసలైన రాజవంశములూ ఉన్నాయి. అలాగే ఉత్తమోత్తమమైన కుటుంబాలు ఇతర కులాలలోను, జాతులలోను ఉన్నాయి. అవన్నీ దివ్య అవతరణమునకు అవకాశములుగానే ఉంటాయి. సూతుడు, విదురుడు, వ్యాసుడు, శుకుడు అట్టి కోవలోని వారు. దివ్యావతరణమునకు పవిత్రత, పరిశుద్ధత మూలసూత్రం. జాతులు, మతములు, కులములు అప్రధానం.

అందరికి అన్నీ పంచి ఇచ్చేవాడు అడుక్కుతినే వాడి ఇంట్లో పుట్టటం అసంభవం. పంచేవాడు పవిత్రు డవుతాడు. ప్రోగుచేసుకొనేవాడు అపవిత్రు డవు తాడు. అన్నిటినీ పంచియిచ్చేవాడి ఇంట్లో అత్యంత పవిత్రులు పుడతారు. ఇది సృష్టి ధర్మం.

## (100)

శిష్యుడు : గురుదేవా! ముక్తికోరటం అజ్ఞాన మంటారా?

గురువు : కోరటం అజ్ఞానం. ఏది కోరినా అజ్ఞానమే. కోరిన వాడల్లా అడుక్కొనే వాడే. అజ్ఞాన మనే దారిద్ర్యము చేత అన్నిటివలెనే ముక్తిని కూడ కోరుతూ ఉంటాడు. కోరితే ముక్తి లేదు. ఏమీ కోరనివాడే ముక్తికి అర్హుడు. అడిగితే ఇచ్చేది కాదు ముక్తి. తానుగ పొందేది ముక్తి. తనయందెట్టి కోరిక లేనివాడు ముక్తుడే. అట్టివాడు తనయందు తానుంటాడు. అతనీ సృష్టిలో దేనికిని ఆకర్షింపబడడు. తనయందు తా నానందిస్తూ, ఇతరుల శ్రేయస్సు కొరకు జీవిస్తూ ఉంటాడు. సమస్త వాంఛల నుండి విముక్తి చెందటమే ముక్తి. వాంఛ అజ్ఞానం, అవరోధము కూడ. ముక్తిని గూర్చిన వాంఛ ముక్తి కవరోధం. లోకశ్రేయస్సు కూడ అట్టివాని నుండి నిర్వర్తింపబడుతుందే గాని లోకశ్రేయస్సు

చేయాలనే వాంఛ కూడ అట్టి వానికుండదు. ముక్తి యుక్తునకు వాంఛలే కాదు, సంకల్పములు కూడ యుండవు. అట్టివాడు భగవంతునికి పనిముట్టై యుంటాడు.

*శుభం భూయాత్!*

# DHANISHTA PUBLICATIONS

D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154


## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Aswini Devatalu | T |
| 13. | Ashram Regulation for Entry | E/G/S |
| 14. | An insight into the WTT | E |
| 15. | Atmasadhana Sutramulu | T |
| 16. | Avathara of Synthesis | E |
| 17. | Ayurvedic Principles of Daily Life | E/G/S |
| 18. | Bharatiya Sampradayamu | T/K/Hi |
| 19. | Book of Prayers | E |
| 20. | Bhagavathamurthy Bheeshmudu | T |
| 21. | Bricks for the Temple | E |
| 22. | Cow | K/T/E/Hi |
| 23. | C.V.V. - Mastaru Yogamu - Sadhana Sutramulu | T |

The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.

| | | |
|---|---|---|
| 24. | Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |
| 25. | Dharmavigrahudu - Sri Ramudu | T |
| 26. | Dhanakamuni Katha | T |
| 27. | Doctrine of Eternal Presence | E |
| 28. | From the Teachers Pen | E |
| 29. | Gayatri Mantra Avagahana | T |
| 30. | Geetopanishad - Sankya Yogamu | T |
| 31. | Geetopanishad - Karma Yogamu | T |
| 32. | Geetopanishad - Gnana Yogamu | T |
| 33. | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 34. | Geetopanishad - Dhyana Yogamu | T |
| 35. | Geetopanishad - Vijnana Yogamu | T |
| 36. | Geetopanishad - Akshra Parabrahma Yogamu | T |
| 37. | Geetopanishad - Rajavidya Rajaguhya Yogamu | T |
| 38 | Geetopanishad - Vibhuthi Yogamu | T |
| 39. | Good Friday | E/S |
| 40. | Gurusisya Samvadamu | T |
| 41. | Healers Handbook | E |
| 42. | Health & Harmony | E/G |
| 43. | Health & Harmony-2 | E |
| 44. | Hercules - The Man and the Symbol | E/G/S |
| 45. | Himalaya Guruparampara | T/Hi/K |
| 46. | Jupiter - The Path of Expansion | E/G/S |
| 47. | Just Adjust | E |
| 48. | Jyotirlinga Yatra | T |
| 49 | Jyothisha Vignanamu | T |
| 50. | Kapila and Kardama | E/G/S |
| 51. | Katha Deepika | T |
| 52. | Kumara Sambavam | T |
| 53. | Lectures on Secret Doctrine - I | S/E |
| 54. | Lectures on Secret Doctrine - II | E |
| 55. | Lectures on Secret Doctrine - III | E |

| | | |
|---|---|---|
| 56. | Listening to the Invisible Master | E/S/K |
| 57. | Lord Maitreya - The World Teacher | E/S |
| 58. | Life and Teachings of Master Jupiter | E |
| 59. | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 60. | Mana Master garu | T |
| 61. | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 62. | Mars - The Kumara | E/G/S |
| 63. | Mercury - The Alchemist | E/G/S |
| 64. | Maria Magdalena | E/S |
| 65. | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 66. | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 67. | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 68. | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 69. | MASTER C.V.V. - Yogamu | T |
| 70. | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |
| 71. | Master K. Parvathi Kumar - Short Biography | E |
| 72. | Master CVV - Saturn Regulations | E/G/S |
| 73. | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 74. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 75. | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 76. | Marana Rahasyam-1 (Markandeya) | T |
| 77. | Marana Rahasyam-2 (Sathi Savitri Devi) | T |
| 78. | Marana Rahasyam-3 (Nachiketudu) | T |
| 79. | Master CSG | E |
| 80. | Messages of Master E.K. | E |
| 81. | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 82. | Moon - The Key | E |
| 83. | New Age Hospital Management | E |
| 84. | Nutrients For Discipleship | E |
| 85. | OM | T/K/E |
| 86. | Occult Meditations | E/G/S |

| | | |
|---|---|---|
| 87. | Om Namo Narayanaya | E/G/S |
| 88. | On Change | E/S |
| 89. | On Healing | E |
| 90. | On Love | E/G/S |
| 91. | On Service | E/G/S |
| 92. | On Silence | E/G/S |
| 93. | PARIKSHIT-The World Disciple | E |
| 94. | Pranayamam | T |
| 95. | Prayers | E/G/S |
| 96. | RUDRA | E |
| 97. | Rukmini Kalyanam | T |
| 98. | Sai Sukthulu | T/K |
| 99. | Sai Ki Amruthavani | Hi |
| 100. | Sanghaneethi | T |
| 101. | SAM | E |
| 102. | Saraswathi-The Word | E/G/S |
| 103. | SANKHYA - The Sacred Doctrine | E/S |
| 104. | Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 105. | Shodosopachara Pooja - Avagahana | T |
| 106. | SOUND-The Key and its Application | E/G/S |
| 107. | Spiritualism-Business and Management | E/G |
| 108. | Spiritual Healing | S/G |
| 109. | Sri Dattatreya | E/G/S/T |
| 110 | Sripada Srivallabha Charitamrutam | E |
| 111. | Srimadramayana Dharmakusumalu | T |
| 112. | Sri Guru Paadukastavamu | T |
| 113. | SRI LALITHA (Set 10 Books)<br>(Comentary on Sri Lalitha Sahasranamam) | T |
| 114. | SRI SASTRY GARU | T/K/E/S |
| 115. | Sri Krishna Namamrutham | T |
| 116. | Sri Shirdi Sai Sayings | E/G/S |
| 117. | Sri Suktam | E |

| | | |
|---|---|---|
| 118. | Steps of Silence | E |
| 119. | Sun that Iam | E/G/S |
| 120. | Temple and the Work | E |
| 121. | Teachings of Lord Maitreya-1 | E |
| 122. | Teachings of Lord Maitreya-2 | E |
| 123. | The Aquarian Cross | E/G/S |
| 124. | The Aquarian Master | E/G/S |
| 125. | The Doctrine of Ethics | E/S |
| 126. | The Etheric Body | E/G/K |
| 127. | The Golden Stairs | E/S |
| 128. | The Path of Synthesis | E |
| 129. | The Splendor of Seven Hills | E |
| 130. | Thus Spoke-Master Dhwhal Khul | E |
| 131. | THE TEACHER-Meaning and Significance | E |
| 132. | Teachings of Master Koot Hoomi 1 & 2 | E |
| 133. | The Teachings of Lord Kapila | E/G |
| 134. | The Teachings of Master Mourya 1 & 2 | E |
| 135. | The Teachings of Sanath Kumara | E/G/S |
| 136. | The Theosophical Movement | E/G/S |
| 137. | The White Lotus | T/E/S/K |
| 138. | The World Teacher | E |
| 139. | The Mysteries of Sagittarius | E |
| 140. | Time - The Key | E/G |
| 141. | Uranus- The Alchemist of the Age | E/G/S |
| 142. | Varuna Graha Prabhavamu | T/K |
| 143. | VENUS-The Path to Immortality | E/S |
| 144. | Violet Flame Invocations | E |
| 145. | Vrutrasura Rahasyam | T |
| 146. | Wisdom Buds | E/S |
| 147. | Wisdom Teachings of Vidura | E/G/S |
| 148. | Yama Geetha | T |

**Please visit our website (www.dhanishta.org / info@dhanishta.org) for prices**

## సద్గురువంటే ........

* సద్గురువంటే నీ యందలి రూపాతీతమైన తత్త్వాన్ని నీకు ఆవిష్కరించేవాడు.
* నీ మనసునకు నిలకడ కల్పించేవాడు.
* నీ అవగాహనకు మించినవాడు.
* నీ యందు నీవలె గోచరించువాడు.
* తాను గురువునని మనసా, వాచా, కర్మణ ప్రకటించని వాడు.
* తనయందు తానుండు వాడు.
* ఎవరినీ నమ్మించు ప్రయత్నము చేయనివాడు.
* స్వాలంబనమే కాని, ఇతర ఆలంబనములు కోరనివాడు.
* తన ఉనికి వలన ఎట్టి భంగము ఎవ్వరికిని కల్పించనివాడు.

ధనిష్ఠ

ISBN 978-81-89467-37-1